## వైసీపీ అరాచక పాలనను

# ఓటుతో అంతం చేయాలి

- టీడీపీ కార్యకర్తలే మా కుటుంబానికి అండ
- టీడీపీ హామీలు.. ప్రజలకు వరాలు
- నెల రోజులు కష్టపడి చంద్రబాబును గెలిపించండి
- కార్యకర్తలకు నారా భువనేశ్వరి పిలుపు



ఓబులవారిపల్లెలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె/రాజంపేట/ఒంటిమిట్ట/సిద్దవటం, మార్చి 21: వైసీపీ అరాచక పాలనను ఓటుతో అంతం చేయాలని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం బద్వేలులో నిర్వహిస్తున్న నిజం గెలవాలి కార్యక్రమానికి వెళుతున్న భువనేశ్వరికి రైల్వేకోడూరులో పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర బీసీ నాయకులు నాయిడోరి రమణ, కాపు నాయకులు కల్లా చలపతి, అనుములగుండం చంద్రశేఖర్, గునిపాటి రాయుడులు ఘనంగా స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలు, నాయకులపై అన్యాయంగా కేసులు మోపారన్నారు. మహిళలపై దాడులు చేశారన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో పెట్టడంతో ఎన్నో గుండెలు ఆగాయని, ఆ కుటుంబాలకు తాము అండగా ఉంటామని తెలిపారు. నెల రోజుల పాటు కష్టపడి ఓటుతో వైసీపీని ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. టీడీపీ హామీలు ప్రజలకు వరాలుగా మారతాయన్నారు. కార్యకర్తలు, నాయకులు కలసి కట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర బీసీ నాయకులు కమతం నాగరాజుయాదవ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, నాయకులు కట్టా గుండయ్యనాయుడు, వెంకటేశ్వర్‌రాజు, కొమ్మా శివ, గడికోట సుబ్బరాయుడు, పోకల మణి, మహిళా నాయకురాళ్లు నగిరిపాటి రేవతి, దుద్యాల అనితాదీప్తి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ముక్కా ఆధ్వర్యంలో జనసమీకరణ

నారా భువనేశ్వరి బద్వేలుకు వెళుతూ ఓబులవారిపల్లెలో టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసమీకరణలో మాట్లాడారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సొంత గ్రామమైన ముక్కావారిపల్లెలో ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్దకు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బీజేపీలకు చెందిన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. నారా భువనేశ్వరికి మధ్యాహ్నం ఒంటిగంటకు అక్కడకు రాగానే ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సమేతంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలే మా కుటుంబానికి అండ అని అన్నారు. ఆ ధైర్యంతోనే నేను ఒంటరిగా ప్రజల్లోకి వస్తున్నానన్నారు. రాబోయే ఎన్నికలలో మన పార్టీని గెలిపించుకుని మన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముక్కా రూపానందరెడ్డి, కస్తూరి విశ్వనాథనాయుడు, పంతగాని నరసింహ ప్రసాద్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు హేమంబరదరరావు, వరలక్ష్మీ, ముక్కా సాయివికాస్‌రెడ్డి, అజయ్‌బాబు, భారీ ఎత్తున కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### రాజంపేటలో ఘన స్వాగతం

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి రాజంపేటలో ఘనంగా స్వాగతం పలికారు. తిరుమల నుంచి బద్వేలుకు వెళుతూ రాజంపేటకు చేరుకున్న సందర్భంగా రాజంపేట మండలం వెంకటరాజంపేట, రాజంపేట పట్టణం ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట హైవే రోడ్డు ప్రాంతంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు డీఆర్‌ఎల్ మణి, మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, టీడీపీ పార్లమెంటు మహిళాధ్యక్షురాలు అనసూయమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్, న్యాయవాది వెంకటసుబ్బయ్య, టీడీపీ పార్లమెంటు అధికార ప్రతినిధి ప్రతాప్‌రాజు, ఎస్సీ సెల్ నేత మందా శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఒంటిమిట్టలో..

నారా భువనేశ్వరికి ఒంటిమిట్ట ఆంజనేయస్వామి గుడి వద్ద రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వరికి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోదండరామాలయం అభివృద్ధి చెందింది టీడీపీ హయాంలోనే అని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు హరినాథరెడ్డి, శివారెడ్డి, మావిల శ్రీహరి, బోడిచెర్ల శ్రీనివాసులు, డాక్టర్ శివకుమార్, మోదుగుల నరసింహులు, రంతు బాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### సిద్దవటంలో..

సిద్దవటంలో టీడీపీ నేతలు నారా భువనేశ్వరికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. సిద్దవటం మండలం జంగాలపల్లె పంచాయతీ కమ్మపాలెం వీరాంజనేయస్వామి గుడి వద్ద తెలుగుదేశం పార్టీ రాజంపేట యువ నేత రాజా నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి భారీ పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, నాయకులు నాగమునిరెడ్డి, చలమయ్యయాదవ్, లక్ష్మీనారాయణ, అయ్యప్పనాయుడు, రాజశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరులో నారా భువనేశ్వరిపై పూలవర్షం కురిపిస్తున్న టీడీపీ అభిమానులు





రాజంపేట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద, ఒంటిమిట్టలో కార్యకర్తలు, ప్రజలకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి

## టీచర్ సస్పెన్షన్ కొనసాగింపు

మదనపల్లె అర్బన్, మార్చి 21: మదనపల్లె మండలంలోని బాలాజీనగర్ మున్సిపల్ హైస్కూల్ మ్యాథ్స్ టీచర్ నుజమత్ నఫీసా సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ గురువారం జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గతంలో ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఆమెపై పలు ఆరోపణలు రావడంతో గతంలో సస్పెన్షన్ చేశారు. అయితే ఆమె సస్పెన్షన్ గడువు అయిపోవడంతో బుధవారం అదే పాఠశాలకు తిరిగి రావడంతో ఈ టీచర్ మాకు వద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేసిన విషయం తెలిసింది. ఆమెను తిరిగి ఇక్కడే కొనసాగిస్తే పాఠశాలకు తాళం వేయడంతో పాటు ఇక్కడి విద్యార్థులను వేరే పాఠశాలల్లో చేర్పిస్తామని హెచ్చరించారు. దీంతో స్పందించిన డీఈవో ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉపాధ్యాయురాలి సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## వైసీపీలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- భగ్గుమన్న ఆకేపాటి, మేడా వర్గాల మధ్య విభేదాలు

ఒంటిమిట్ట, మార్చి 21: ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. వారి వర్గీయులు ఒకరినొకరు దూషించుకోవడంతో పాటు ఘర్షణకు దిగినట్లు తెలిసింది. వివరాలిలా ఉన్నాయి. మంటపంపల్లెలోని పెన్నా సిమెంటు అధినేత పెన్నా వేణుగోపాల్‌రెడ్డి స్వగృహంలో మండలంలోని వైసీపీ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లతో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాజంపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఆకేపాటి అనిల్, పెన్నాసిమెంటు అధినేత పెన్నా వేణుగోపాల్‌రెడ్డిలు 13 గ్రామ పంచాయతీల వారీగా వైసీపీ నాయకులతో విడివిడిగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంటపంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో బూత్ కమిటీలను ఎందుకు తొలగించారని మేడా వర్గీయుడు గడ్డం నాగేశ్వరరెడ్డి, అమర్‌నాథరెడ్డి వర్గీయులైన జేసీబీ సుబ్బారెడ్డి, మల్లిరెడ్డిల ఘర్షణ పడ్డారు. చొక్కాలు పట్టుకుని ఒకరినొకరు తోసుకున్నారు. ఘర్షణ పెరిగి పెద్దదవుతుండటంతో నాయకులు కలుగచేసుకుని వారికి సర్దిచెప్పినట్లు తెలిసింది.

స్వామివారి కల్యాణోత్సవం చేస్తున్న వేద పండితులు



## కమనీయం.. నారసింహుడి కల్యాణం

- గరుడ వాహనంపై భక్తులకు దర్శమిచ్చిన స్వామివారు

గుర్రంకొండ, మార్చి 21: తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని టీటీడీ వేద పండితులు శ్రీదేవి, భూదేవిలతో కన్నులపండుగలా చేశారు. గురువారం ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, అభిషేకాలను చేశారు. అనంతరం తిరుచ్చి వాహనంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను చేసి గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను సర్వభూపాల వాహనంలో ఉంచి పూజలను నిర్వహించారు. అనంతరం టీటీడీ అధికారులు తెచ్చిన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై ఆధిరోహింపజేసి ప్రత్యేక పూజలను చేశారు. గరుడ వాహనంపై స్వామి వారు పురవీధుల్లో విహరించి భక్తులను కరుణించారు. స్వామి వారి వాహనం ముందు చెక్కభజనలు, కోలాటాలు, బళ్లారి డ్రమ్ములు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి వేలాదిగా భక్తులు వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, వెంకటస్వామి, ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్ భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజ్, అనిల్, గోకుల్, నరసింహులు, వరద, వెంకీ, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

## ఎన్నికల నియమావళి వర్తించదా?

- డ్రైనేజీ పనులు ప్రారంభించిన వైసీపీ నాయకులు
- అడ్డుకున్న అధికారులు



గుర్రంకొండ కొత్తపేటలో డ్రైనేజీ పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

గుర్రంకొండ, మార్చి 21: గుర్రంకొండ పట్టణంలో ఎన్నికల నియమావళిని తుంగ లో తొక్కి డ్రైనేజీ పనులను వైసీపీ నాయకులు గురువారం ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి అభివృద్ధి పనులు చేయకూడదని నియమ నిబంధనలున్నాయి. గుర్రంకొండ పట్టణంలోని కొత్తపేటలోని ఓ వీధిలో డ్రైనేజీ పనులను వైసీపీ నాయకులు ప్రారంభించారు. ఈ క్రమంలో కాలువ కోసం ఎక్స్‌కవేటర్‌తో మట్టి పనులు ప్రారంభించడంతో స్థానికులు దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామి పనులు జరుగుతున్న ప్రదేశానికి చేరుకుని పనులను నిలుపుదల చేశారు. అలాగే పంచాయతీ పరిధిలోని గాజులవారిపల్లెలో తాగునీటి సమస్యను ఏళ్లుగా పట్టించుకోని వైసీపీ నాయకులు రెండురోజుల క్రితం రాత్రి పూట బోరు వేసి కోడ్ ఉల్లంఘించినట్లు స్థానికులు చర్చించుకోవడం విశేషం. గుర్రంకొండ పట్టణంలో ఎన్నికల నియమావళి అమలు కావడం లేదని ప్రజలు, నాయకులు గుసగుసలాడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఎన్నికల కోడ్ అమలు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

# జగనన్నా.. ఇదేందన్నా..!

- స్లిప్పులు ఒకరికి, పట్టాలు మరొకరికి, రిజిస్ట్రేషన్ ఇంకొకరికి
- జగనన్న కాలనీల్లో ఇబ్బడిముబ్బడిగా వెలుగు చూస్తున్న అక్రమాలు
- జేసీ గారు.. మమ్మల్ని మీరైనా పట్టించుకోండి
- పీలేరు జగనన్న కాలనీ లబ్ధిదారుల వేడుకోలు

పేదలందరికీ ఇళ్లు ఇస్తామని, వారి పేరుతోనే వాటిని రిజిస్ట్రేషన్ చేసిస్తామని మీరేమో ఆర్భాటంగా చెప్పారు. మా పేరుతో పట్టా అయితే ఇచ్చారు కానీ ఆ ఆనందం మాకు ఎక్కువ రోజులు లేదు. మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాటిని ఆక్రమించి మాకు అన్యాయం చేస్తున్నారని పీలేరులోని జగనన్న కాలనీల లబ్ధిదారులు వాపోతున్నారు. జగనన్న కాలనీల్లో రోజురోజుకు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ఆక్రమణలు, నకిలీ లాటరీ టోకెన్లు, నకిలీ పట్టాలతో ఓవైపు, అధికార పార్టీ నేతల బెదిరింపులు, అన్యాయమైన సెటిల్‌మెంట్లతో తాము సతమతమైపోతున్నామని వారు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారిగా నియమితులు కావడంతో ఆయన రాకతోనైనా మా సమస్యలు తీరతాయేమోనని లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.



తహసీల్దారుకు తమ సమస్యలు విన్నవించుకుంటున్న జగనన్న కాలనీ లబ్ధిదారులు (ఫైల్)

పీలేరు, మార్చి 21: పీలేరు మండలం బాలంవారిపల్లెకు చెందిన కవితకు రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీ-3 లేఔట్‌లో ఇంటి పట్టా మంజూరు చేశారు. ఎంతో కాలంగా సొంతింటి కోసం వేచి చూస్తున్న ఆమె కుటుంబ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎంతో సంతోషంతో అధికారులు అందించిన లాటరీ టోకెన్, పట్టా నెంబరు తీసుకుని తనకు కేటాయించిన ప్లాటు వద్దకు వెళ్లింది. మంచిరోజు చూసుకుని ఇంటి కోసం పునాదులు తీసుకునే పనులు ప్రారంభించింది. ఇంతలో మరో వ్యక్తి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఆ ప్లాటు తనదని, అధికారులు తనకు కేటాయించారని తెలిపాడు. అదేంటి నాకు కేటాయించిన ప్లాటు మరొకరికి ఎలా ఇస్తారని, ఈ వ్యవహారాన్ని అధికారుల వద్ద తేల్చుకోవాలని బయలుదేరింది. అధికారులేమో ఆ పట్టా ఆమెదేనని తేల్చారు. అడ్డు వచ్చిన వ్యక్తేమో అక్కడ కట్టొద్దని హుకుం జారీ చేశాడు. అవసరమైతే తనపై కేసు కూడా పెట్టుకోవచ్చునని, అలా కుదరకపోతే ఎంపీ, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి తన పేరు చెప్పాలని బెదిరించాడు. దీంతో కవిత కుటుంబం తమ కుల సంఘ నాయకులను ఆశ్రయించింది. వారు కలుగజేసుకుని రెవెన్యూ, పోలీసు అధికారులకు విషయం చెప్పి దగ్గరుండి మరీ పునాదులు తీయించారు.

● పీలేరు పట్టణానికి చెందిన మరో మహిళకు రెవెన్యూ అధికారులు అదే ఏపీఐఐసీ-3 లేఔట్‌లో పట్టా మంజూరు చేశారు. ఆమె వద్ద లాటరీ టోకెన్, అధికారులు అందించిన పట్టా నెంబరు, పట్టా పుస్తకం అన్నీ ఉన్నా కూడా ఇతరుల పేరు మీద అదే స్థలం రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. ఆ సంగతి అధికారులకు ఫిర్యాదు చేస్తేనేమో రిజిస్టర్ అయిపోయి ఉంటే తాము ఏమీ చేయలేమని, మరో స్థలం చూపిస్తామని చావు కబురు చల్లగా చెప్పారు. తనకు వచ్చిన స్థలం తన ప్రమేయం లేకుండా, ఎటువంటి టోకెన్లు, పట్టా లేని వ్యక్తులు ఎలా రిజిస్టర్ చేసుకున్నారో అర్థం కాక ఆ గృహిణి తెల్లముఖం వేసింది.

### నిత్య వివాదంలో ఏపీఐఐసీ-3 లేఔట్


పీలేరు మండలంలోని ఇళ్లు లేని పేదల కోసం ప్రభుత్వం సుమారు 30 ప్రాంతాల్లో (అన్ని గ్రామ పంచాయతీలు కలుపుకుని) లేఔట్లు ఏర్పాటు చేసింది. అయితే ఆయా పంచాయతీల్లో స్థలాభావం ఏర్పడడంతో మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న వారికి పీలేరు పట్టణంలోని ఏపీఐఐసీ లేఔట్‌లలో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా గత ఏడాది ఏప్రిల్‌లో ఏపీఐఐసీ-3 లేఔట్ ఏర్పాటు చేసి అందులో సుమారు 2500 మందికి పట్టాలు మంజూరు చేశారు. పీలేరు పట్టణంలో స్థలాలకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో అటు అక్రమార్కులు, ఇటు అధికార పార్టీ నేతల కన్ను ఏపీఐఐసీ-3 లేఔట్‌పై పడింది. 2500 పట్టాల్లో అధికారులను నయానో భయానో దారికి తెచ్చుకుని 800 పట్టాలు లాటరీ విధానంలో పెట్టకనే అధికార పార్టీ నేతలు కాజేశారనే ఆరోపణలు అప్పట్లో గుప్పుమన్నాయి. అధికార పార్టీ నేతలు పంచుకోగా మిగిలిన 1700 పట్టాలను అధికారులు ఆర్భాటంగా లాటరీ విధానంలో టోకెన్లు, ఆ టోకెన్ల ఆధారంగా ఇంటి నెంబరు, ఆ నెంబరు ఆధారంగా ఇంటి పట్టా మంజూరు చేశారు. అయితే ఆ లేఔట్ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి దాని చుట్టూ వివాదాలు అలుముకున్నాయి. పీలేరు-మదనపల్లె రహదారికి దగ్గరగా ఉండడం, ఎటువంటి రాళ్లూ రప్పలు లేకుండా స్థలం చదునుగా ఉండడంతో ఒక్కో ఇంటి స్థలం విలువ రూ.2 లక్షల దాకా పలుకుతోంది. దీంతో ఆ ప్రాంతంలో అక్రమార్కులు, అధికార పార్టీ నేతలు చెలరేగిపోతున్నారు. వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఈ ఏడాది జనవరిలో అప్పటి తహసీల్దారు ధనంజయులు తన సిబ్బంది ద్వారా ఆ లేఔట్‌పై ప్రత్యేక విచారణ జరిపించగా అందులో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. పేదలకు అందించిన 1700 పట్టాల్లోనూ సుమారు 700 పట్టాలు అన్యాక్రాంతమయ్యాయని, రెవెన్యూ అధికారులు మొదలుకుని వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, చోటా మోటా నాయకుల వరకు వాటన్నింటినీ తమ బినామీల ద్వారా ఆక్రమించుకున్నారని తేలింది. సమయం, సందర్భం అనుకూలించినప్పుడు వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తేలింది. దీంతో ఆయన వాటిలో అత్యధిక శాతం పట్టాలను రద్దు చేసి కొత్త లబ్ధిదారులకు అందజేశారు. ఆయన బదిలీపై వెళ్లిపోయాక గతంలో నకిలీ టోకెన్లతో పట్టాలు పొందిన వారు మరోమారు విజృంభిస్తున్నారు. కొత్తగా అక్కడకు వెళుతున్న లబ్ధిదారులను బెదిరించడం, వారిని భయపెట్టి తమకు అనుకూలమైన నాయకుల దగ్గర పంచాయితీలు పెట్టడం, అందులో కుదిరితే లబ్ధిదారుల వద్ద అంతో ఇంతో డబ్బులు వసూలు చేయడం, కుదరకపోతే లబ్ధిదారులకే అంతో ఇంతో సొమ్ములు చేతిలో పెట్టి వారి వద్ద ఉన్న అసలైన పత్రాలు లాక్కోవడం చేస్తున్నారు. ఒత్తిళ్లకు లొంగని లబ్ధిదారులకు తెలియకుండా తమ అధికారం చూపించి వేర్వేరు సచివాలయాల్లో తమ పేరిట గానీ, తమ బంధువుల పేరిట గానీ గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు కానిచ్చేస్తున్నారు.



పీలేరులోని ఏపీఐఐసీ-3 లే-ఔట్

### నిత్యం వందల సంఖ్యలో ఫిర్యాదులు

ఎన్నికల బదిలీలలో భాగంగా పీలేరుకు వచ్చిన తహసీల్దారు మహబూబ్‌బాషా చెంతకు ఏపీఐఐసీ-3 లేఔట్ బాధితులు అనునిత్యం వందల సంఖ్యలో వస్తున్నారంటే అతిశయోక్తి కాదు. గతంలో ఇక్కడ ఏం జరిగిందో అర్థం కాక, తనకు అప్పగించిన ఎన్నికల విధుల నిర్వహణకు పూర్తి సమయం కేటాయించకలేక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో పీలేరు ఎన్నికల అధికారి (రిటర్నింగ్ అధికారి)గా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ రావడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా సమస్య పరిష్కారం కాకపోతే ఎలాగూ జిల్లా కేంద్రానికి వెళ్లి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాల్సిందేనని, అలా వెళ్లాల్సిన పనిలేకుండా జేసీనే పీలేరుకు రావడం పట్ల వారు కాసింత ధైర్యం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ వ్యవహారాల్లో కీలకంగా ఉండే జేసీ తమ సమస్యలను పట్టించుకుని వాటిని పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఎన్నికల నిర్వహణకు కాసింత సమయం దొరికినందున, కాలనీల్లోని అక్రమ వ్యవహారాలపై దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



బాలంవారిపల్లెకు చెందిన కవితకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టా

### అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి..



జగనన్న కాలనీల్లో ప్రతిరోజూ ఏదో ఒక మూల ఆక్రమణ, అన్యాయం జరుగుతూనే ఉంది. స్థానిక అధికారులకు వేలసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. జాయింట్ కలెక్టర్ వాటి గురించి పట్టించుకుని పేద ప్రజలకు న్యాయం చేయాలి.

- శ్రీనివాసులు, భారతీయ అంబేడ్కర్ సేన నాయకుడు

## భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య


లక్ష్మీదేవి మృతదేహం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21: మండలంలోని కస్తూరిరాజుగారిపల్లెకు చెందిన లక్ష్మీదేవి (28) అనే వివాహిత భర్త వేధింపులు తాళలేక గురువారం తెల్లవారుజామున బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... రామాపురం మండలం గువ్వలచెరువు మూలపల్లెకు చెందిన ఒంటేరు లక్ష్మీదేవికి లక్కిరెడ్డిపల్లె మండలం కస్తూరిరాజుగారిపల్లెకు చెందిన ప్రసాద్‌కు 8 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం. కొన్నాళ్లపాటు వీరి జీవనం అన్యోన్యంగా సాగినా ఆ తర్వాత నిత్యం గొడవలు పడేవారని, దీంతో మృతురాలు రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. కాగా బుధవారం రాత్రి కూడా ఇరువురు గొడవలు పడ్డారని, దీంతో బిడ్డలను వదిలేసి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఉదయాన్నే చుట్టుపక్కల వెతికారు. అనంతరం గ్రామానికి సమీపంలోని పాతబావిలో శవమై కనిపించడంతో మృతురాలు బంధువులు బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి, బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలపారు.

## వివాహం చేయలేదని యువకుడు...


మహేశ్ (ఫైల్)

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21: మండలంలోని బి.యర్రగుడి పంచాయతీలోని కాపుపల్లెకు చెందిన దేరంగుల మహేశ్ (22) అనే యువకుడు వివాహం చేయలేదని మనస్థాపానికి గురై గురువారం తెల్లవారుజామున ఇంటిలో పైకప్పుకు ఉన్న కడ్డీకి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. బి.యర్రగుడి కాపుపల్లెకు చెందిన మహేశ్ డిగ్రీ చదువు పూర్తి చేసుకుని ఎన్‌సీసీలో పట్టా పొంది ఆర్మీకి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో తనకు వివాహం చేయాలని కుటుంబ సభ్యులను అడుగగా, నీకంటే పెద్దవాడు మీ అన్నకు వివాహం చేయకుండా నీకెలా చేస్తామని వారించారు. దీంతో మహేశ్ మనస్థాపానికి గురై తన ఇంటిలోని పైకప్పుకు ఉన్న కడ్డీకి చీరతో ఉరివేసుకొన్నాడు. ఉదయాన్నే తన అన్న రమేశ్ లేచి చూడగా చీరకు వేలాడుతున్న తన తమ్ముడిని గుర్తించి హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని బంధువులు తెలిపారు. ఈ మేరకు మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న సీఐ శంకర్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 21: రెంటాల బాబు (15) అనే బాలుడిని ఈనెల 18వ తేదీ హత్య చేసి ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆ వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన బాబు, అతడి తల్లి అనురాదాదేవి, నిందితుడు రెంటాల సురేశ్ నగరిగుట్టలోని పక్క పక్క ఇళ్లలో నివాసం ఉండేవారు. రెంటాల సురేశ్ మతిస్థిమితం సరిగా లేనట్లు నటిస్తూ దారిన పోయే వారితో గట్టిగట్టిగా అరుస్తూ ఉండేవాడు. నిందితుడికి వివాహం కానందున బాబు, అతడి తల్లి అప్పుడప్పుడు అతడికి కూరలు ఇచ్చేవారు. ఈ క్రమంలో 18వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లి బాబును అక్కడే ఉన్న బ్యాట్‌తో తలపై, ముఖంపై బలంగా కొట్టగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా గురువారం సాయంత్రం పులివెందలలో అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

## మూడు మోటారు సైకిళ్లు దహనం



కాలిపోయిన మోటారు సైకిళ్లు, వివరాలు వెల్లడిస్తున్న సీఐ భాస్కర్‌రెడ్డి

కడప (క్రైం), మార్చి 21 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నాగరాజుపేట, శ్రీహరిరావు వీధిలో గురువారం తెల్లవారుజామున నారసనేని చంద్రశేఖర్ ఇంటి ముందు పార్కు చేసి ఉంచిన హోండా డియో మోటారు సైకిలు, టీవీఎస్ ఎక్సెల్‌లను బేగ్ మహబూబ్‌బాషా అనే వ్యక్తి నిప్పంటించి కాల్చివేశాడు. అలాగే మరికొంత దూరంలో నాగరాజుపేటకు చెందిన న్యాయవాది షేక్ నజీర్‌బాషా హోండా యాక్టివా మోటారు సైకిలుకు నిప్పు పెట్టడంతో పాక్షికంగా కాలిపోయాయి. ఈ రెండు సంఘటనల గురించి ఇరువురు బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామితో కలిసి విచారణ చేపట్టారు. సీపీవో షేక్ ఆబిద్ సహకారంతో వాహనాలను నిప్పుపెట్టిన నిందితుడిని స్థానికంగా ఉన్న సీసీ టీవీల ఫుటేజీ ద్వారా కనుగొన్నారు.

**గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్టు :** వాహనాలకు నిప్పు పెట్టిన నిందితుడిని పోలీసులు కొన్ని గంటల వ్యవధిలోనే గుర్తించారు. కడప పాత బస్టాండులో అనుమానాస్పదంగా తిరుగుతున్న రవీంద్రనగర్‌కు చెందిన బేగ్ మహబూబ్‌బాషాగా గుర్తించారు. గురువారం కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ భాస్కర్‌రెడ్డి నిందితుడి వివరాలను తెలిపారు. నిందితుడు కడప నగరంలో హోటళ్లలో పని చేస్తూ మద్యానికి బానిసయ్యాడన్నారు. అలాగే పంచర్లు వేసే సొల్యూషన్‌ను పీల్చేవాడన్నారు. ఇతను గతంలో కూడా కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో నిద్రపోతున్న బాలుడి తలను పగలగొట్టిన కేసులో ఆరు సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించాడన్నారు.

## నేటి నుంచి ఇంటర్మీడియట్ మూల్యాంకనం

**హాజరు కాని అధ్యాపకులకు జరిమానా : ఆర్ఐవో**



కడప (ఎడ్యుకేషన్), మార్చి 21: ఇంటర్మీడియట్ మూల్యాంకనం శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపా రు. జ్ఞాన భూమి లాగిన్‌లో అధ్యాపకుల అపాయింట్‌మెంటు ఆర్డర్లు ఉన్నాయన్నారు. మూల్యాంకనానికి హాజరు కాని అధ్యాపకులకు జరిమానాతో పాటు కఠినచర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మూల్యాంకనానికి హాజరు కావాలన్నారు. స్పాట్ వాల్యుయేషన్ అపాయింటుమెంటు ఆర్డర్స్ పొందిన అధ్యాపకులు మూల్యాంకనానికి హాజరయ్యేలా కళాశాల ప్రిన్సిపాల్స్, యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని సూచించారు. హాజరు కాని అధ్యాపకునికి రోజుకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

## నేడు డయల్ యువర్ ఆర్ఎం

రాయచోటిటౌన్, మార్చి 21: ఏపీఎస్ఆర్టీసీ సమస్యలపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం ఉంటుందని ఆర్టీసీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ సేవలు పొందుతున్న ప్రయాణికులతో పాటు ఇతర ప్రజలు తమ సమస్యలు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 8985283211 అనే నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలిచేయాలన్నారు.

## 32 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం, మార్చి 21: మండలంలోని లావనూరు, తాళ్లప్రొద్దుటూరు గ్రామాలలో 32 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లావనూరు గ్రామానికి చెందిన క్రిష్ణమూర్తి అనే వ్యక్తి 14 బీరు బాటిళ్లు, 3 మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి 15 మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

## అభివృద్ధి పేరుతో 'నిధులు 'లిఫ్ట్'

- అంచనా రూ.5.95 లక్షలు ● వ్యయం రూ.15.80 లక్షలు
- టెండరు లేకుండానే పనులు ● డీసీఎంఎస్‌లో అవకతవకలు


డీసీఎంఎస్ భవనం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మార్చి 21: అభివృద్ధి మాట దేవుడెరుగు.. అవకాశం చిక్కితే పంచుకుతినడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అభివృద్ధి మాటున నిధులను స్వాహా చేస్తున్న సంఘటన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పురాతన గోదాములను కూలగొట్టి వ్యాపార సముదాయం కలిగిన కాంప్లెక్స్‌ను గత పాలకులు నిర్మించారు. దీంతో డీసీఎంఎస్‌కు ఒక మంచి ఆస్తి ఒనగూరినట్లయింది. అయితే అప్పట్లోనే బహుళ అంతస్తులు గల ఈ భవనానికి లిఫ్టు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. ఏ కారణం చేతనో ఆ ఒక్క పని ఆగిపోయింది. నాలుగు అంతస్తులు గల ఈ భవనానికి కొన్ని అంతస్తుల గల భవనాలు ఖాళీగా ఉన్నా యి. వాటిల్లో చేరేందుకు లిఫ్టు లేకపోవడం వల్ల ఎవరు ముందుకు రావడం లేదని, లిఫ్టు ఏర్పాటు చేస్తే గదులు ఖాళీగా లేకుండా అద్దె వసూలయ్యే అవకాశం ఉంటుందని పీఐసీ కమిటీలోని కొంత మంది పెద్దలు, అధికారులు ఆలోచనకు వచ్చారు. అదే తడవుగా లిఫ్టు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. అయితే కేవలం రూ.6లక్షల లోపు ఖర్చయ్యే ఈ పనిని రూ.15.80 లక్షల మేరకు ఖర్చు చేశారని, ఇందులో భారీ స్థాయిలో అవకతవకలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

### వర్కింగ్ ఎస్టిమేషన్ నుంచే అక్రమాలు...

ప్రధానంగా లిఫ్టు ఏర్పాటు విషయంలో మొదట చేయాల్సిన వర్కింగ్ ఎస్టిమేషన్ పనిని చేపట్టలేదని.. అక్కడ నుంచే అక్రమాలకు పునాది పడిందని కొంత మంది చర్చించుకుంటున్నారు. నిబంధనల మేరకు వర్క్ ఎస్టిమేషన్ వేసిన తరువాత బోర్డు సమావేశంలో పెట్టి, బోర్డు ఆమోదించిన తరువాత టెండర్లకు పిలవాల్సి ఉంటుందని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. అలా వచ్చిన టెండర్లలో లెస్‌కు వేసిన వారిని ఎంపిక చేసి వారికి సంబంధించిన ఫర్మ్ సక్రమంగా ఉందా, లేదా అన్నది చూసిన తరువాత పనులు అప్పగించాలని నిబంధనలు చెబుతున్నాయి. దీంతో పాటు మెజర్‌మెంటు బుక్‌లో అన్నీ పొందుపరచాలని, వీటన్నిటి కంటే ప్రథమంగా టెక్నికల్ ఆర్డరు ఉండాల్సిన అవసరం ఉంది. అందు కోసం సాంకేతిక నిపుణుల అవసరం ఉన్నప్పటికీ వీటిల్లో ఏ ఒక్కటీ ఆలస్యం చేయకుండా ఒక ప్రైవేటు కాంట్రాక్టరుకు పనులు అప్పగించి భారీ స్థాయిలో నిధులు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు జరుగుతున్న సమయంలో మానిటరింగ్ ఆఫీసర్లను నియమించాలని.. అలా చేయకుండా గుత్తమొత్తంగా పనిని కాంట్రాక్టరుకు అప్పగించడం నిబంధనలకు విరుద్ధమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రూ.5.95 లక్షలు పనికి...

ప్రస్తుతం డీసీఎంఎస్‌లో ఏర్పాటు చేసిన లిఫ్ట్ అంచనా మొత్తం రూ.5.95 లక్షలతో పూర్తవుతుందని హైటెక్ లిఫ్ట్ అండ్ ఎస్కవేటరు సంస్థ ఎస్టిమేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. జీ ప్లస్2 గ్రౌండ్‌తో పాటు రెండంతస్తుల భవనానికి ఆరుగురిని తీసుకెళ్లే కెపాసిటీ గల లిఫ్టును ఏర్పాటు చేసేందుకు గేటుతో ఏర్పాటు చేస్తే 5.95 లక్షలు, గ్లాస్ డోర్ ఆటోమేటిక్ అయితే రూ.7.45 లక్షలతో ఏర్పాటు చేయవచ్చని ఎస్టిమేషన్ ఇచ్చిన పరిస్థితి. కానీ ఈ ఎస్టిమేషన్‌లో పేర్కొన్న లిఫ్టు మహా అయితే రూ.6లక్షలు ఖర్చయ్యే పరిస్థితి ఉంది. మరి ఏ విధంగా రూ.15.80 లక్షలు ఖర్చు చేశారో అంతు చిక్కని విషయంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే అంశంపై ఇప్పటికే సహకారశాఖ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు బయటపడే అవకాశాలు లేకపోలేదు. వాస్తవంగా గణాంకాలు పరిశీలిస్తే దాదాపు రూ.10లక్షల మేర పక్కదారి పట్టినట్లు తెలుస్తుంది.

### ప్రైవేటు వ్యక్తికి అప్పగించడంలో...

కడప నగరంలో లిఫ్టుకు సంబంధించిన ఒక ప్రముఖ కంపెనీ ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యక్తికి దాని నిర్మాణ బాధ్యతలు అప్పగించడం, పనులు మొదలు పెట్టినప్పటి నుంచీ డబ్బులు ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటోననే అంతు చిక్కడం లేదు. ఇదిలా ఉంటే పనులు పూర్తి చేసిన కాంట్రాక్టరు జీఎస్టీ ఇన్‌వాయిస్ ఇస్తే రూ2.5 లక్షల వరకు తిరిగి డీసీఎంఎస్‌కు జీఎస్టీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆ ఇన్‌వాయిస్ కూడా ఇవ్వకపోవడంతో దాన్ని కూడా కోల్పోవాల్సిన పరిస్థితి. దీనిపై సహకార శాఖ ఉన్నత స్థాయి అధికార యంత్రాంగం దృష్టి సారించి సమగ్రంగా విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై స్థానిక డీసీఎంఎస్ మేనేజరు ఖాదర్‌వల్లిని వివరణ కోరగా, ఆన్‌లైన్ ద్వారా కొటేషన్లు స్వీకరించామని, వాటిల్లో మూడు కొటేషన్లు వచ్చాయని, అందులో లెస్‌కు వేసిన వారికే పనులు అప్పగించామన్నారు.


డీసీఎంఎస్ భవనం లిఫ్టు

## శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, మార్చి 21: మూడు రోజుల పాటు నిర్వహించే కేర్ క్యాంపెనియన్ (సంరక్షణ సహచర కార్యక్రమం) శిక్షణను సీహెచ్‌వోలు, ఎంఎల్‌హెచ్‌పీలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రదాల్లో పనిచేస్తున్న సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలకు జరగనున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా గురువారం రాయచోటిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎస్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిలు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న సీహెచ్‌వో/ఎంఎల్‌హెచ్‌పీ (సమాజ ఆరోగ్య అధికారులు)లకు జిల్లాలోని మూడు డివిజన్‌లలో మూడు బ్యాచ్‌ల చొప్పున మొత్తం 9 బ్యాచ్‌లతో కలిపి 375 మంది సీహెచ్‌వోలకు శిక్షణ ఇస్తారన్నారు. డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ మాట్లాడుతూ ఒక్కో డివిజన్‌లో ఒక్కొక్క శిక్షణ పొందిన టీవోటీల చేత రాయచోటి, రాజంపేట, మదనపల్లె డివిజన్‌లలో మూడు రోజుల పాటు ఈ శిక్షణ ఈనెల 21వ నుంచి ఏప్రిల్ నెల 4వ తేదీ వరకు మూడు విడతలుగా జరుగుతాయన్నారు. శిక్షణ కార్యక్రమం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో టీవోటీ డాక్టర్ జవహర్‌బాబు, రాయచోటి డివిజన్‌లోని వివిధ పీహెచ్‌సీలలో పనిచేస్తున్న సీహెచ్‌వోలు హాజరయ్యారు.

## ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

పీలేరు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే ఆదేశాలు, నియమాలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ ఫర్మాన్ అహ్మద్ తెలిపారు. పీలేరులోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అన్ని పార్టీలు ఒక్కటేనని, ఎన్నికలకు సంబంధించిన ఏ పని చేయాలన్నా రాజకీయ పార్టీలు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన కోడ్ ఆఫ్ కాండక్టును అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రచారాలు, కార్యాలయాల ఏర్పాటు, వాహనాల ద్వారా ప్రచారం వంటి వాటి కోసం 'సువిధ' యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఆ యాప్ అందుబాటులో ఉందని, దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో అనుమతులు లభిస్తాయన్నారు. కోడ్ ఆఫ్ కాండక్టు ఉల్లంఘించే వారిపై 'సి-విజిల్' యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని వివరించారు. అనంతరం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులకు 'సి-విజిల్' యాప్ పనితీరును వివరించారు. ఈ సమావేశంలో ఈఆర్‌వో రమ, పీలేరు, వాల్మీకిపురం, కలకడ, కేవీపల్లె, గుర్రంకొండ, కలికిరి తహసీల్దారు మహబూబ్ బాషా, ఖతీజున్ ఖుబ్రా, విజయకుమారి, శ్రీనాథ్, ప్రియదర్శిని, నయాజ్ అహ్మద్, టీడీపీ, వైసీపీ, సీపీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాచమల్లుపై బెదిరింపుల కేసు నమోదు

ప్రొద్దుటూరు, మార్చి 21: వైసీపీ మహిళా కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి ఆమె భర్త రామాంజనేయులరెడ్డిలను ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడిన ఘటనపై త్రీటౌన్‌పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా.. ఫిబ్రవరి 19న తన భర్త ఇంట్లో లేని సమయంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి తన భర్తను అసభ్యపదజాలంతో దూషించి, పార్టీ ప్రచారంలో పాల్గొనకపోతే మీ అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని జంబాపురం వెంకటలక్ష్మి ఎస్పీకి మొదట ఫిర్యాదు చేశారు. అనంతరం జాతీయ ఎన్నికల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, త్రీటౌన్ సీఐ వెంకటరమణ విచారించారు. అంతేకాకుండా ఆమె ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌బాను ఎమ్మెల్యే బెదిరింపు ఘటనపై విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. దీంతో డీఎస్పీ మళ్లీ విచారించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మార్చి 18న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై ఐపీసీ 448, 506 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద నమోదు చేశారు. కేసు నమోదు తరువాత ఎమ్మెల్యే రాచమల్లు నుంచి తమకు రక్షణ కల్పించాలని కౌన్సిలర్ వెంకటలక్ష్మి, రామాంజనేయరెడ్డి వారి కుటుంబసభ్యులు కోరడంతో వారికి బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌బాను సమక్షంలో డీఎస్పీ మురళీధర్ భరోసా కల్పించారు. ఎటువంటి బెరింపులకు పాల్పడినా, ఏదైనా హాని జరిగిన తమకు ఫోన్ చేయాలని తెలిపారు.

## హుండీని పగులకొట్టిన దొంగలు



ఖాజీపేట, మార్చి 21: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె వద్ద గల భీమలింగేశ్వర ఆలయంలో బుధవారం అర్ధరాత్రి హుండీని దొంగలు పగులకొట్టారు. ఆ హుండీలో ఏమీ లేకపోవడంతో ఆలయ కమిటీ ఊపిరి పీల్చుకుంది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సీఐ రామాంజులు మాట్లాడుతూ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాచ్‌మెన్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 21 : వైవీయూ ఏప్రిల్‌లో జరపతలపెట్టిన స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు పొందడానికి దరఖాస్తు స్వీకరణ గడువు ఈనెల 21 నుంచి 30వ తేతీ వరకు పొడిగించినట్లు వీసీ చింతా సుధాకర్ తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా వివిధ డిగ్రీల పట్టాల కోసం 8898 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులు సకాలంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

## పోలీసు అధికారులు, సిబ్బందికి ఉగాది పురస్కారాలు

కడప(క్రైం), మార్చి 21: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఉగాది పర్వదినాన వీరు పురస్కారాలు అందుకోనున్నారు.

కడప ఏఆర్ ఏఎస్పీ కృష్ణారావు, 11వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావుకు ఉత్తమ సేవా పతకం లభించింది. అలాగే సేవా పతకాల కింద కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ అరుణాచలం, సిద్దవటం హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆనంద్, ప్రొద్దుటూరు ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కడప ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు, 11వ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుళ్లు మోహన్, ఓబులేసు, ప్రొద్దుటూరు ఫైర్ సర్వీసు లీడింగ్ ఫైర్‌మెన్ నారాయణరెడ్డి, కడప ఫైర్ స్టేషన్‌లో పనిచేస్తున్న డ్రైవర్/ఆపరేటర్ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

## బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


నవ్య మృతదేహం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 21: మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థిని నవ్య ఆత్మహత్య చేసుకున్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం కళాశాలలో పరీక్ష రాసిన కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థిని నవ్య ఆరోగ్యం బాగోలేదని హాస్టల్‌కు వెళ్లింది.

సాయంత్రం నాలుగు గంటలకు కళాశాల విద్యార్థినులు హాస్టల్‌కు చేరుకున్నారు. హాస్టల్ తలుపులు మూసి ఉండడంతో ఎంతసేపు పిలిచినా పలకకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచారు. ఆ విద్యార్థి ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించింది. ఆందోళన చెందిన విద్యార్థులు పాఠశాల నిర్వాహకులకు తెలిపారు. ఆ విద్యార్థిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి ఆమె అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆ విద్యార్థిని గుంతకల్ వాసి అని కళాశాల నిర్వాహకులు తెలిపారు.

## గంగమ్మకు పొంగుబాళ్లు



పెనగలూరు, మార్చి 21: మండలంలోని దిగువ రాచవారిపల్లె గ్రామంలో గురువారం గ్రామ ప్రజలు గ్రామదేవత గంగమ్మ తల్లికి పొంగుబాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మహిళలు గ్రామదేవతకు అభిషేక కార్యక్రమాలు నిర్వహించి పొట్టేళ్లు, కోళ్లను బలిచ్చి దేవతను శాంతింపజేశారు. మధ్యాహ్నం దేవాలయ ప్రాంగణంలో భక్తులకు విందుభోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిలి, బీసీ కాలనీ, కుడప అరుంధతి వాడ, ఎగువరాచపల్లె, జెస్తపల్లె, జెట్టివారిపల్లె, నారాయణ నెల్లూరు భక్తులు పాల్గొని గంగమ్మను దర్శించుకున్నారు.

## వాహనాలు తనిఖీ



సుండుపల్లె, మార్చి 21: ఎన్నికల విధుల్లో భాగంగా మండల కేంద్రమైన సుండుపల్లెలో ఎన్నికల తనిఖీ అధికారుల బృందం గురువారం తనిఖీలు నిర్వహించారు. సుండుపల్లెలోని బస్టాండు సమీపంలో రాయచోటి రోడ్డులో వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. తనిఖీల్లో సుండుపల్లె, వీరబల్లి మండలాల టీం-1 బృందంలోని అధికారి, ఈవోపీఆర్డీ సురేశ్‌బాబు, ఏఆర్ ఎస్ఐ లక్ష్మయ్య, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## అడవులను రక్షించుకుందాం

సంబేపల్లె, మార్చి 21: అడవులే మానవులకు ఎంతో ఉపయోగపడే ఆర్థిక సంపద అని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా అడవుల సంరక్షణపై గురువారం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడవులు పక్షులు, జంతువులకు నివాసాలు మాత్రమే కాకుండా ప్రజలకు జీవనాధారంగా ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరయ్య, రవిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రసాద్‌బాబుకు శుభాకాంక్షలు

గాలివీడు, మార్చి 21: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక నూతన కార్యదర్శిగా ఎంపికైన సుగవాసి ప్రసాద్‌బాబుకు గాలివీడు టీడీపీ యువనాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సుగవాసి కార్యాలయంలో పలువురు టీడీపీ యువనాయకులు పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గుడుపల్లి కరుణాకర్‌రెడ్డి, గాండ్లపల్లి శివ, మండెం శివశంకర్, పసుపులేటి సత్యనారాయణ, మురుగు నాగేశ్వర్‌నాయుడు, నరసింహనాయుడు, దేవపట్ల జనార్థన్, రామాంజులునాయుడు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున పాల్గొన్నారు.

## బందోబస్తును పరిశీలించిన సీఐ

చిన్నమండెం, మార్చి 21: మండలంలోని మల్లూరు కొత్తపల్లె గ్రామ పంచాయతీల్లో ఈ నెల 25, 26వ తేదీల్లో జరగనున్న మల్లూరమ్మ జాతర బందోబస్తు ఏర్పాట్లను రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, చిన్నమండెం ఎస్ఐ రమేశ్‌బాబు పరిశీలించారు. వాహనాల పార్కింగ్ సదుపాయం, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై పరిశీలించారు. వీరి వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 'రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం'

రాయచోటిటౌన్, మార్చి 21: రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని డీసీసీ జిల్లా అధ్యక్షుడు షేక్ అల్లాబకాష్ అన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఆయన జిల్లాలోని 30 మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాయచోటి ఖాదర్‌ఖాన్, మదనపల్లెకు రెడ్డిసాహెబ్, రాజంపేటకు నరేశ్‌లను పట్టణ అధ్యక్షులుగా నియమిస్తూ వారికి డీసీసీ కార్యాలయంలో గురువారం నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మహిళా అధ్యక్షురాలు గోశాలదేవి, మదనపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్‌రఫీ, రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ శాంతమ్మ తదితర అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# మిగిలిన వలంటీర్ల పరిస్థితి ఏంటి ?

- ఈ నెల 10వ తేదీన పదిమందికి షోకాజ్ నోటీసులు
- నలుగురు మీదే చర్యలు..!

చిన్నమండెం, మార్చి 21: మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీలో మార్చి 9వ తేదీ వైసీపీ నాయకులతో కలిసి పది మంది వలంటీర్లు మెడలో కండువాలు వేసుకుని నెత్తిమీద పార్టీ జెండా టోపీ ధరించి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో టీడీపీ నాయకులు ఫొటోలు, వీడియోలతో కూడిన ఆధారాలతో పది మంది వలంటీర్లపై ఫిర్యాదు చేశారు. దీనిపై మార్చి 10న 'ఈసీ దీనికేమంటుందో' అన్న కథనం ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వెలువడింది. ఈ క్రమంలో ఎంపీడీవో రామకృష్ణ వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కానీ వీరిలో ఎల్వీ రమణారెడ్డి, ఈశ్వరయ్య, రెడ్డెమ్మ, రాజన్నల మీద మాత్రమే వేటు వేసి చేయి దులుపుకున్నారు. మిగిలిన 6 మంది మీద ఎలాంటి చర్యలు లేకపోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకుల వలే కండువాలు వేసుకొని ఊరూరా తిరిగిన ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేస్తే కంటితుడుపుగా నలుగురు మీద మాత్రమే చర్యలు తీసుకోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఇదే విషయమై ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా పంచాయతీ సెక్రటరీ రిపోర్టు మేరకు నలుగురు మీద చర్యలు తీసుకున్నామన్నారు.




ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనం, వలంటీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన దృశ్యం

# అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

- అగ్నిమాపకశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 21: అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని రాయచోటి అగ్నిమాపకశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బోస్‌నగర్‌లో గల ప్రైవేటు పాఠశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో విద్యార్థులు తమను తాను రక్షించుకోవడమే కాకుండా ఇతరులను ఏ విధంగా రక్షించాలనే అంశాలపైన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన అవగాహన కల్పించారు. అంతేగాక విద్యార్థులు అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకొని, మీ కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల వారికి కూడా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అనంతరం నారాయణ పాఠశాల ఏజీఎం శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఖాదర్‌వలిలు మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని చెప్పారు. అలాగే నారాయణ విద్యాసంస్థల్లో అకడమిక్ విద్యతో పాటు పరిసరాల పరిజ్ఞానంపై కూడా వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు బయట ప్రపంచం గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో నరసింహులు, అకడమిక్ డీన్ యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ సుగుణవేణి, నందిని, అకడమిక్ కోఆర్డినేటర్స్ సంపత్, జెరూష, భానుశ్రీ, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న రాయచోటి అగ్నిమాపకశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి

## 25న ఆదిభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ



దేవరపల్లెలోని ఆది భైరవస్వామి ఆలయం

గాలివీడు, మార్చి 21: మండలంలోని పందికుంట పంచాయతీ దేవరపల్లెలో నూతనంగా నిర్మించిన ఆది భైరవస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు కానాల బయారెడ్డి, కానాల శివారెడ్డిలు పేర్కొన్నారు. 23న గణపతిపూజ, దీపారాధన, ఆచార్య ఋత్వికరణం, పంగవ్యము, తీర్థ సంగ్రహణ, కలశ స్థాపన, యోగశాల ప్రవేశం, తీర్థప్రసాద వినియోగం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, పూర్వక దీక్ష హోమం, మహాగణపతి హోమం, నైవేద్యం, తీర్థప్రసాద వినియోగం, 24న ప్రాతఃకాలపూజలు, వేద పారాయణం, మంత్రమూల మూర్తులకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష ఆదిభైరవ హోమం, రుద్రహోమం, 120 కలశాలతో విగ్రహాలకు మహాస్నానం, 25న విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, అలంకారం, జ్వాలాదర్శనం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా వారు తెలియజేశారు.

## దేవాలయ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



తహశీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పుల్లంపేట, మార్చి 21: మండల పరిధిలోని దళవాయిపల్లె గ్రామంలో రామాలయం ఎదురుగా ఉన్న గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమించారని గురువారం గ్రామస్తులు తహశీల్దారు వెంకటనారాయణకు ఫిర్యాదు చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న 6 సెంట్ల స్థలంలో ఆలయానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు నిర్వహించేవారమన్నారు. ఈ స్థలాన్ని గ్రామానికి చెందిన ఓబిలి చిన్నపరెడ్డి కుటుంబం ఆక్రమించారని వారు ఆ ఫిర్యాదులో ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారును కోరారు.

## పీఎఫ్ సొమ్మును జమ చేయాలి

- మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

రాయచోటిటౌన్, మార్చి 21: మున్సిపల్ కార్మికులకు రావాల్సిన పీఎఫ్ సొమ్మును వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో చెన్నయ్య అధ్యక్షతన మున్సిపల్ యూనియన్ పట్టణ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు నిత్యం శ్రమించి తమ జీవితంలోని కొంత సొమ్మును భవిష్య నిధిగా భద్రపర్చుకుంటే పీఎఫ్ ఖాతాకు జమచేయకుండా వారి సొమ్మును ప్రభుత్వం స్వాహా చేయడానికి అధికారులు సహకరిస్తున్నారని, ఇటువంటి అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అగ్గిరామయ్య, శంకరయ్య, తిరుపాల్, మంగమ్మ, తిరుపతమ్మ, సుభాషిణి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రేంజర్ కళావతి

సిద్దవటం, మార్చి 21: ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా సిద్దవటంలోని విద్యార్థులకు ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పచ్చని చెట్లు పెంచాలి, చెట్లను నరకకూడదు, అడవికి నిప్పు పెట్టకూడదు, జంతువులను సంరక్షించాలి అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డు ధరించి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచలింగాల వద్ద ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలు తొలగించారు. విద్యార్థినీ, విద్యార్థులకు అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పబ్లిక్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రైల్వేకోడూరు బ్రాంచి మేనేజరు గారు నాకు ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్ మేరకు యావన్మందికి తెలియజేయడం ఏమనగా వాక రామమోహన్ తండ్రి రామయ్య, డి.నెం. 3/48-బి, మాదిగపల్లె, యర్రయ్యనేనిపాళెం, భాగంపల్లె, చుండుపల్లె మండలం, వై.ఎస్.ఆర్.జిల్లా.

షెడ్యూలు: వై.యస్.ఆర్. డి., చుండుపల్లె సబ్.డి.కు చేరిన చుండుపల్లె మండలము చుండుపల్లె గ్రామ పంచాయితీకి చేరిన చుండుపల్లె గ్రామ మజరా రెడ్డివారిపల్లె 3వ వార్డు ఏరియాలో అసైన్‌మెంటు కాని జాగా వివరములు : స.ఖ. డి.నెం. 2049-పి1 య. 2.24 సెంట్లు పైకి యం. 99 1/2 సెంట్లు పైకి 100 చ. గజములు 83.60 మీటర్లు.

ఇందు చెక్కు బంది వివరము : తూర్పు - వాకా బాబు జాగా, పడమర : 20 అడుగులు వెడల్పు గలరోడ్డు, ఉత్తరం- 10 అడుగులు వెడల్పుగల రోడ్డు, దక్షిణం : ప్లాటు నెం. 18రు గల జాగా

ఆర్.సి. సురేష్‌బాబు, అడ్వకేట్, కోడూరు

## పబ్లిక్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రైల్వేకోడూరు బ్రాంచి మేనేజరు గారు నాకు ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్ మేరకు యావన్మందికి తెలియజేయడం ఏమనగా ఎర్రగొల్ల వెంకటరమణ తండ్రి కృష్ణయ్య 2) ఎర్రగొల్ల సుహాసిని భర్త వెంకటరమణ, వీరు ఇరువురు డి.నెం. 7/333-1, మ్యూక్షిష్టయ్యనగర్, కోడూరు గ్రామం & పోస్ట్, కోడూరు మండలం, కడపజిల్లా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా చెందిన వీరు క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్తిని రైల్వేకోడూరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు (మార్టిగేజ్) పెట్టకొని లోన్ తీసుకొంటున్నారు. ఇందుకుగాను ఎవ్వరికైనను అభ్యంతరములు వున్న యెడల ఈ రోజు నుండి 7 రోజులు లోపు నాకుగాని లేదా శ్రీరామ్ ఫైనాన్స్‌కు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. అభ్యంతరములు లేవని యెడల తీర్మానించబడును. షెడ్యూలు: కడప డి. ప్రస్తుతం అన్నమయ్య, పుల్లంపేట సబ్.డి.లో చేరిన కోడూరు మండలం, కోడూరు గ్రామ పంచాయితీకి చెందిన కోడూరు గ్రామ పొలం సర్వేనెం. 13/1ఎ పైకి కోడూరుగ్రామం యూనియన్ 10వవార్డులోని శివరామకృష్ణ థియేటర్ -రాజారెడ్డి ఆఫీసుకు ఎగువ భాగమున రెసిడెన్షియల్ ఏరియాలో నేను మీకు విక్రయించబడిన డోర్ నెం. 10/440-26గల ఆర్.సి.సి. మిద్దె ఇంటికి చెక్కుబంది: తూర్పు - సింగిరి రాజమ్మ మిద్దె ఇల్లు, పడమర : పోతినేని వెంకటసుబ్బయ్య మిద్దె ఇల్లు, ఉత్తరం- షేక్ ఖాదర్‌బాషా విక్రయించిన జాగా, దక్షిణం: 18 అడుగులు వెడల్పుగల రోడ్డు

ఆర్.సి. సురేష్‌బాబు, అడ్వకేట్, కోడూరు

## పబ్లిక్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రైల్వేకోడూరు బ్రాంచి మేనేజరు గారు నాకు ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్ మేరకు యావన్మందికి తెలియజేయడం ఏమనగా ఎం. దేవీబాయి భర్త బాలా నాయక్, ఉప్పరపల్లె మజరా, సూర్యతాండా గ్రామం, ఉప్పరపల్లె రోడ్డు, తుగ్గలి మండలం, కర్నూలు జిల్లాకు చెందిన వీరు క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్తిని రైల్వేకోడూరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు (మార్టిగేజ్) పెట్టకొని లోన్ తీసుకొంటున్నారు. ఇందుకుగాను ఎవ్వరికైనను అభ్యంతరములు వున్న యెడల ఈ రోజు నుండి 7 రోజులు లోపు నాకుగాని లేదా శ్రీరామ్ ఫైనాన్స్‌కు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. అభ్యంతరములు లేవని యెడల తీర్మానించబడును. షెడ్యూలు: కడప డి. ప్రస్తుతం అన్నమయ్య, పుల్లంపేట సబ్.డి.లో చేరిన కోడూరు మండలం, కోడూరు గ్రామ పంచాయితీకి చెందిన కోడూరు గ్రామ పొలం సర్వేనెం. 15155, 1515/7 ల్లు పైకి కోడూరు గ్రామం యూనియన్ 7వ వార్డులో చెన్నంశెట్టి నగర్‌కు చెందిన ఇంటీరియల్ ఏరియా డోర్ నెం. 7/930 ఇంటికి దూరముగా ఏర్పడిన ప్లాట్లలో బి బ్లాక్‌లో నేను మీకు విక్రయించిన 5వప్లాట్లులో ఉత్తరదిశన 2 అంకణములు గాగల ఖాళీ జాగాకు చెక్కుబంది కొలతలు వివరం ఇందుకు చెక్కుబంది వివరములు: తూర్పు-18 అడుగుల వెడల్పుగల రోడ్డు, పడమరగాలి మల్లికార్జునగారి జాగా, ఉత్తరం- సంకేపల్లి వెంకటేశు జాగా, దక్షిణం :బి బ్లాకులో నా సొంత 5వ ప్లాటులో మిగతాజాగా

ఆర్.సి. సురేష్‌బాబు, అడ్వకేట్, కోడూరు



## రాంప్రసాద్‌రెడ్డి సుడిగాలి పర్యటన



కార్యకర్తలతో మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, మార్చి 21: మండలంలోని రాచపల్లె, చిట్లూరు, కల్పనాయునిచెరువు గ్రామాల్లో గురువారం రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన కుమారుడు నిచ్చల్ నాగిరెడ్డిలు సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా రాచపల్లె పంచాయతీలోని నాయునివారిపల్లె, గంగనేరు క్వార్టర్స్ వడ్డెపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, చిట్లూరు పంచాయతీలోని చెరువుముందరపల్లె, కల్పనాయునిచెరువు పంచాయతీలోని అగ్రహారం, హరిజనవాడ గ్రామల్లో ఆయన పర్యటించి టీడీపీ కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. ప్రతి కార్యకర్త ఇంటికి వెళ్లి కార్యకర్తలను సంప్రదించి మాట్లాడారు. గ్రామాల్లో ఆయనకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చిన్నమండెం:** మండలంలోని కేశాపురం గ్రామం దేవళంపేటకు చెందిన టీడీపీ నాయకురాలు లక్ష్మమ్మ గత పది రోజుల క్రితం ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగి తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటిలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె భౌతికకాయాన్ని సందర్శించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లక్ష్మమ్మ మృతి టీడీపీకి తీరని లోటని ఆయన అన్నారు. ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

## సున్నపురాళ్లపల్లెలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం




గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఓబులవారిపల్లె, మార్చి 21: మండలంలోని సున్నపురాళ్లపల్లె గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వారు జాతీయ సేవా కార్యక్రమం నిర్వహించారు. నాల్గవ రోజు పాఠశాల విద్యార్థులకు యోగా కార్యక్రమంపై పీడీ రవిశంకర్ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి కుటుంబం ఇబ్బందులపాలు కాకుండా ఉండేందుకు బ్యానర్లు కట్టి ప్రదర్శన చేశారు. అనంతరం గ్రామ రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత, అలాగే జీవ ఎరువుల తయారీ వినియోగించు విధానంపై తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ నిశ్చల, ప్రొఫెసర్ అగ్రనమీ, డాక్టర్ లక్ష్మీదేవి, రవిశంకర్, అలాగే ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు

- ఎన్నికల అధికారి లీలారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి లీలారాణి

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 21: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల అధికారి లీలారాణి అన్ని పార్టీల నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉండడంతో రాజకీయ పార్టీలు తమ సభలు, సమావేశాలు, ర్యాలీలు వంటి కార్యక్రమాలు నిర్వహించాలంటే ఎన్నికల అధికారి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసినా, ప్రలోభాలకు గురి చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు, రైల్వేకోడూరు సీఐ టి.బాబు, ఎస్ఐ డాక్టర్ నాయక్, స్థానిక ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారమే ఐసీడీఎస్ లక్ష్యం: సీడీపీవో



పోషణ్ పక్వాడ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, మార్చి 21: గర్భిణీలకు, బాలింతలకు మంచి పౌష్టికాహారాన్ని అందివ్వడమే ఐసీడీఎస్ లక్ష్యమని సీడీపీవో సుజామణి అన్నారు. గురువారం నందలూరు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రాణి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజామణి మాట్లాడుతూ మనం నిత్యం తీసుకొనే ఆహారంలో ఆకుకూరలు, కాయగూరలు తప్పనిసరిగా తీసుకుంటే ఆ పౌష్టికాహారం వల్ల తల్లీబిడ్డలు అనారోగ్యం బారిన పడకుండా క్షేమంగా ఉంటారన్నారు. గర్భవతులు, యుక్త వయస్సు బాలికలు కూడా నిత్యం ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తినడం వల్ల రక్తప్రసరణ బాగా జరిగి ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ కార్తీక్, విశ్వనాథ్, హెల్త్ సూపర్‌వైజర్, మహిళా కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## సీజీఆర్ ట్యాలెంట్ మీట్ పోస్టర్ విడుదల

రాజంపేట, మార్చి 21: మండల పరిధిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సీజీఆర్ ట్యాలెంట్ మీట్ 2024 పోస్టర్లను కళాశాల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి చేతుల మీదుగా గురువారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజీఆర్ ట్యాలెంట్ మీట్‌లో టెక్నికల్ సింకోజియం, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్, కల్చర్ ఈవెంట్స్, స్పాట్ ఈవెంట్స్ అనే అంశాలు ఉన్నాయన్నారు. ఈ ఈవెంట్లు ఏప్రిల్ 3, 4వ తేదీల్లో నిర్వహించబడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం వల్ల వ్యక్తిగత నైపుణ్యం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, డీన్ డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ ఓ.హేమకేశవులు, అసోసియేట్ ప్రొఫెసర్లు, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : సీఐ



చక్రంపేటలో ఓటర్లతో మాట్లాడుతున్న సీఐ

పెనగలూరు, మార్చి 21: మరో నెలలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాల్లో కానీ, పోలింగ్ కేంద్రాల వద్ద కానీ ఎవరైనా అలజడులు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా గురువారం పొందలూరు, చక్రంపేట, పాతపల్లి, కాకర్లవారిపల్లె గ్రామాలలో ఎస్ఎస్‌బీ పోలీసు బృందాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రంపేట బస్టాండులో సమావేశమైన ఓటర్లనుద్దేశించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, ఏఎస్ఐలు మల్లికార్జున వరప్రసాద్, రాముడు, కానిస్టేబుళ్లు సుబ్బరాయుడు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయాలి



ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నందలూరు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని ప్రజలందరూ స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రచెరువుపల్లి, చెన్నయ్యగారిపల్లెలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ప్రజలలో ఎటువంటి భయభ్రాంతులు లేకుండా ఓటుహక్కును వినియోగించుకునేందుకే ఈ కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ ధనుంజయరెడ్డి, కానిస్టేబుల్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత లక్ష్మీనారాయణకు మాతృవియోగం



సుబ్బమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

రాజంపేటటౌన్, మార్చి 21: టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వారి సోదరుడు రాజంపేట పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు సంజీవరావు తల్లి సుబ్బమ్మ (85) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, ఆకేపాటి గోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, కౌన్సిలర్ రమణారెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మండల మాజీ అధ్యక్షుడు బాపనయ్య నాయుడు, వెంకటేశ్వర్లనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వెంకటనరసయ్యనాయుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శరత్ కుమార్‌రాజు తదితరులు సంతాపం వ్యక్తం చేసి తరిగోపుల సోదరులను పరామర్శించారు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

## ఇద్దరు వలంటీర్ల తొలగింపు




ప్రచారంలో పాల్గొన్న వలంటీరు రోహిత్ - ద్విచక్రవాహనంపై వైసీపీ జెండాతో వలంటీర్ మదన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21: గుడిపాల మండలం రామభద్రాపురం క్లస్టర్-5 వలంటీరు పి.రోహిత్ చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డితో కలిసి గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. దీంతో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన కారణంగా రోహిత్‌ను విధులనుంచి తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు.

**గంగాధరనెల్లూరు:** గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన మదన్ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ, మండల వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పదవిలో కొనసాగుతున్నారు. వైసీపీ స్టిక్కర్లతోపాటు పార్టీ జెండాను కట్టిన ద్విచక్ర వాహనంపై ఆయన మండల కేంద్రంలో పలుచోట్ల పర్యటిస్తూ తీసుకున్న వీడియో, ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో స్వయంగా పోస్ట్‌చేసి హల్‌చల్ చేశారు. దీనిపై ఎంపీడీవో భాస్కర్‌కు సమాచారం అందింది. ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు వలంటీర్ మదన్‌ని విధుల నుంచి తొలగించారు. అలాగే గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన మరో వలంటీర్ డిల్లీకుమార్ గురువారం సాయంత్రం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు.

## కారు సహా చీరల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న చీరలను పరిశీలిస్తున్న సీఐ

సోమల, మార్చి 21: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తరలిస్తున్న చీరలను కారుతోపాటు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. కర్నాటక రిజిస్ట్రేషన్‌తో బెంగళూరు నుంచి పీలేరుకు వెళుతున్న కారును సోమల పోలీసులు గురువారం ఉదయం స్థానిక బస్టాండులో తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 113 చీరలు, 172 టాప్‌లు, 126 లంగా పీసులు, మరికొన్ని వస్తువులను గుర్తించారు. దీంతో వాటిని వాహనంతోపాటు స్వాధీనం చేసుకున్నారు. విచారిస్తున్నామని పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు

**ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అధికారులకు సమాచారం అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయినా కొన్నిచోట్ల ఇంకా ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి.**

### పలువురిపై వేటు వేసిన అధికారులు

**మద్యం దుకాణం సేల్స్‌మేన్ తొలగింపు**

కల్లూరు, మార్చి 21: 'పులిచెర్ల మండలం కల్లూరు-1 ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సేల్స్‌మేన్ కేశవులు నాయుడు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. దీంతో ఆయన్ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు' అని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, మద్యం డిపో మేనేజర్ ఆయేషా తెలిపారు. ఈనెల 17వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో సేల్స్‌మేన్ కేశవులునాయుడు పాల్గొన్నారంటూ స్థానిక టీడీపీ నాయకులు సీ-విజిల్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కి ఫిర్యాదు చేశారు. దీనిపై జరిగిన విచారణలో కోడ్ ఉల్లంఘించినట్లు రుజువు కావడంతో సేల్స్‌మేన్‌ని విధుల నుంచి తొలగించినట్లు ఆయేషా తెలిపారు.

**ఎఫ్ఏలపై చర్యలకు విచారణ నివేదిక అందజేత**

పులిచెర్ల మండలం మంగళంపేట పంచాయతీ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న క్షేత్ర సహాయకుడు (ఎఫ్ఏ) మధు ఈనెల 17వ తేదీన మండల వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని స్థానిక టీడీపీ నాయకులు సీ-విజిల్, ఎంపీడీవో సురేష్‌బాబుకు ఫిర్యాదుచేశారు. దీనిపై ఎంపీడీవో విచారించి, మధు నుంచి రాతపూర్వకంగా సంజాయిషీ తీసుకున్నారు. నివేదికను డ్వామా పీడీ రాజశేఖర్‌కు పంపామని ఎంపీడీవో తెలిపారు. కాగా, ఇదే ర్యాలీలో పాల్గొన్న అయ్యావాండ్లపల్లి, దిగువపోకలవారిపల్లి ఉపాధి క్షేత్రసహాయకులపై ఫిర్యాదులు అందడంతో ఎంపీడీవో ఇప్పటికే వారిని విచారించి, నివేదికలను డ్వామా పీడీకి పంపారు.



ర్యాలీలో కేశవులునాయుడు పాల్గొన్నట్లు టీడీపీ నేతలు ఇచ్చిన ఫొటో

**ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్**

కుప్పం, మార్చి 21: గుడుపల్లె మండలం ఉపాధి హామీ పథకం బెగ్గిలపల్లె పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ నరిసింహులు బుధవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బెగ్గిలపల్లె పంచాయతీ గణేశ్‌పురం క్రాస్ సీతారాముల ఆలయం ఎదుట జడ్పీటీసీ కృష్ణమూర్తి, ఎంపీపీ వరలక్ష్మితో కలిసి, పార్టీ టోపీ వేసుకుని మరీ దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దాంతో ఎన్నికల నియమావళిని అతిక్రమించారనే కారణంతో ఆయన్ను ఉద్యోగంనుంచి సస్పెండ్ చేస్తూ పీడీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉల్లంఘనలపై తగిన చర్యలు తీసుకోండి : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21: జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం రాత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఆర్వోలు, ఏఆర్వోలు, ఏఈఆర్వోలు, నోడల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధులకు ఉద్యోగులు గైర్హాజరౌతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, నిజమని తేలితే అట్టివారిపై చర్యలుంటాయని స్పష్టం చేశారు. చౌకదుకాణ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, ప్రచారాల్లో పాల్గొంటున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయని, వారు తమ డీలర్‌షిప్పులకు రాజీనామా చేసి ప్రచారాల్లో పాల్గొనాలని, లేకుంటే వారిపై ఈసీ సూచనల మేర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్య, జడ్పీసీఈవో గ్లోరియా, డీఎల్‌డీవో రవి కుమార్, పలువురు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రచారంలో జడ్పీ హైస్కూల్ వాచ్‌మేన్



వైసీపీ ప్రచారంలో వాచ్‌మేన్ పృథ్వి

కుప్పం, మార్చి 21: అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే క్రమం ఆగడం లేదు. తాజాగా కుప్పం పట్టణం కొత్తపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కాంట్రాక్టు వాచ్‌మేన్ పృథ్వి.. వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. కుప్పం మున్సిపాలిటీ 13వ వార్డులో వైసీపీ ఎమ్మె ల్యే అభ్యర్థి కేఆర్‌జే.భరత్ ప్రచారం చేస్తుండగా.. మెడలో పార్టీ కండువాతో ఆ బృందంలోని కార్యకర్తలతో కలసి నడిచి స్వామిభక్తిని చాటుకున్నారు.



ఉలవలదిన్నెలో వాటర్ ట్యాంకుపై రెపరెపలాడుతున్న వైసీపీ జెండా

### వాటర్ ట్యాంకుపై వైసీపీ జెండా

పుంగనూరు, మార్చి 21: పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె గ్రామంలో వాటర్ ట్యాంకుపై వైసీపీ జెండా రెపరెపలాడుతోంది. ఇటువంటి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



### గంగవరం సచివాలయం వద్ద వైసీపీ రంగులు

గంగవరం, మార్చి 21: గంగవరం సచివాలయం ఆవరణలో ఉన్న తాగునీటి ట్యాంకుకు వైసీపీ రంగులున్నాయి. కింది భాగంలో కొంత మార్చి, పైభాగంలో వదిలేశారు. దీంతోపాటు తహసీల్దార్ కార్యాలయ ప్రహరీకి ఉన్న వైసీపీ రంగుల పెయింటింగ్‌లో కింది భాగంలో ఉన్న ఒక్క రంగు మాత్రం తుడిచేసి, మమ అనిపించారు.

## తిరుచానూరు ఆలయంలో క్యూకాంప్లెక్సుకు గ్రీన్‌సిగ్నల్

- రూ.23 కోట్లతో మూడంతస్తుల భవన సముదాయం
- మాడవీధుల్లో కదిలే వంతెన

తిరుచానూరు, మార్చి 21 : శ్రీవారి దేవేరి పద్మావతీ దేవి కొలువైన తిరుచానూరులో అత్యాధునిక క్యూకాంప్లెక్సు పనులు మొదలయ్యాయి.భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో గత యేడాది ఆగస్టులో టీడీపీ పాలకమండలి రూ.23కోట్ల వ్యయంతో తిరుమల తరహాలో అత్యాధునిక క్యూకాంప్లెక్సు నిర్మాణానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.గత నెల క్యూకాంప్లెక్సు టెండర్‌ను దక్కించుకున్న కంపెనీ పనులు ప్రారంభించింది. పాత డిప్యూటీ ఈవో కార్యాలయ భవన సముదాయంలో ఈ క్యూకాంప్లెక్సును నిర్మించనున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా 0.75ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాత డిప్యూటీ ఈవో కార్యాలయం, కల్యాణమండపం సముదాయాన్ని తొలగిస్తున్నారు.క్యూకాంప్లెక్సు నిర్మాణానికి సుమారు ఏడాదికి పైగా పడుతుందని టీటీడీ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు తెలిపారు. తిరుమల తరహాలో క్యూకాంప్లెక్సులో ప్రవేశించిన భక్తులు అన్ని సేవలూ అక్కడే పొంది ప్రత్యేక క్యూలైను ద్వారా అమ్మవారి దర్శనం చేసుకుని బయటకు వచ్చేలా క్యూకాంప్లెక్సు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. మూడంతస్తులతో క్యూకాంప్లెక్సు నిర్మాణం జరగనుంది. సెల్లార్‌లో లాకర్లు, సెల్‌ఫోన్, పాదరక్షల కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులకు టిక్కెటు కౌంటర్లు, సెక్యూరిటీ పాయింట్ వస్తాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో వెయిటింగ్ హాల్, కల్యాణకట్ట రానుంది. ఇంకో అంతస్తులో క్యూలైన్, వెయిటింగ్ హాల్ రానుంది.నాల్గవ గేట్ వద్ద నిర్మించనున్న ఈ క్యూకాంప్లెక్సులోకి భక్తులు ప్రవేశించిన తరువాత లగేజీలను అక్కడే భద్రపరచుకుని ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనానికి వెళతారు. ఇక తిరుమల మాడ వీధుల్లో ఉండే మూవింగ్ బ్రిడ్జి(కదిలే వంతెన)ను పాత పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మించనున్నారు. అమ్మవారి ఉత్సవాల సమయంలో వాహనసేవలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు ఈ నూతన క్యూకాంప్లెక్సు నుంచి కదిలే వంతెన ద్వారా పుష్కరిణి పక్కనే ఏర్పాటు చేయనున్న క్యూలైను ద్వారా ఆలయం వెలుపల ఉన్న ప్రాకారం గుండా ఇపుడున్న క్యూలైన్‌లోకి భక్తులు ప్రవేశించనున్నారు.

### టెన్త్ జవాబు పత్రాల డీకోడింగ్ ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 21: టెన్త్ పరీక్షలు జరుగుతున్న తరుణంలోనే ఇతర జిల్లాల నుంచి మన జిల్లా కేంద్రానికి వచ్చిన జవాబు పత్రాలను స్థానిక పీసీఆర్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో గురువారం సిబ్బందికి సమావేశం నిర్వహించి, జవాబు పత్రాల డీకోడింగ్‌పై సూచనలు చేశారు. అనంతరం డీకోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.

### చిత్తూరులో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21: ద్రోణి ప్రభావ కారణంగా చిత్తూరు నగరంలో గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో తేలికపాటి వర్షం కురిసింది. దాంతో రాత్రంగా అధిక ఉష్ణోగ్రతతో ఇబ్బంది పడ్డ నగర ప్రజలకు ఈ వర్షం ఆహ్లాదకర వాతావరణం కలిగించింది.

## వైసీపీ నుంచి టీడీపీలోకి..

**లోకేశ్ సమక్షంలో భారీగా చేరిన జీడీనెల్లూరు నాయకులు**



నారా లోకేశ్‌తో సూరిరెడ్డి

శ్రీరంగరాజపురం, మార్చి 21: డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రాతినిథ్యం వహిస్తున్న జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి వలసలు పెరిగాయి. గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో తిరుపతి విమానాశ్రయంలో ఎస్ఆర్‌పురం మండలం నుంచి దాదాపు వందమంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్టకు చెందిన చిత్తూరు పార్లమెంటు వైసీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌రెడ్డి అలియాస్ సూరిరెడ్డికి లోకేశ్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సూరిరెడ్డి చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సొంత పంచాయతీకి చెందినవారే. సూరిరెడ్డివెంట మరో 60 మంది అనుచరులు చేరారు. అలాగే ఈ మండలంలోనే పుల్లూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీలు గుర్రప్ప, గిరి, వైసీపీ నేత రమేశ్ సహా పలువురు విమానాశ్రయంలోనే టీడీపీలో చేరారు. వైసీపీలో అరాచకాన్ని సహించలేకే టీడీపీలో చేరామని తెలిపారు. వైసీపీలో అణచివేతకు గురి చేస్తున్నారని సూరిరెడ్డి ఆరోపించారు.

## పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడి

పలమనేరు, మార్చి 21: పలమనేరు మండలం ముసలిమడుగు అటవీ ప్రాంతం నుంచి వారం రోజులుగా ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడులకు పాల్పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండ్రోజుల కిందట ముసలి మడుగు గ్రామానికి చెందిన రామచంద్రనాయుడు అనే రైతు సాగుచేసిన వరి పొలంలో దాదాపు అర ఎకరాను తొక్కి నాశనం చేసింది. అంతేకాక రామచంద్రనాయుడు ఆవుల కోసం నిర్మించిన షెడ్ గోడను సైతం కూల్చివేయడంతోపాటు తవుడు, పొలం వద్ద నాటిన అరటి చెట్లు సైతం పెరికి తినేసింది. దీనివల్ల రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లాలంటే చుట్టుపక్కల రైతులు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఒంటరి ఏనుగు నుంచి రక్షణ కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.



ముసలిమడుగు వద్ద ఏనుగు తొక్కి నాశనం చేసిన వరిపొలం



## తెప్పపై రుక్మిణీకృష్ణుల విహారం

తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి):తిరుమలలో నిర్వహిస్తున్న శ్రీవారి తెప్పోత్సవాల్లో రెండవరోజైన గురువారం రుక్మిణీకృష్ణులు తెప్పపై భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుల ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో విద్యుద్దీపాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన తెప్పపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, అన్నమయ్య కీర్తనల ఆలాపనల నడుమ ఉత్సవమూర్తులను తెప్పపై పుష్కరిణిలో మూడుచుట్లు తిప్పారు.శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తెప్పపై దర్శనమివ్వనున్నారు.

## మంచి రోజులొస్తాయి

### ధైర్యంగా పనిచేయండన్న లోకేశ్

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తనను కలిసిన పార్టీ నాయకులతో ఆప్యాయంగా మాట్లాడారు. తిరుమలలోని గాయత్రి సదన్ అతిథిగృహం వద్దకు బుధవారం రాత్రి చేరుకున్న ఆయన అక్కడున్న కార్యకర్తలతో మాట్లాడారు. దాదాపు 15 నిమిషాలు బయటే నిలబడి కార్యకర్తలతో ఫొటోలు దిగారు.గురువారం కూడా శ్రీవారి దర్శనానంతరం తనను చూసేందుకు వచ్చిన నాయకులతో, కార్యకర్తలతో కొంతసేపు మాట్లాడారు. 'ఎలా ఉన్నారు, మంచి రోజులు వస్తాయి, ధైర్యంగా పనిచేయండి' అని సూచించారు.చూడ్డానికి వచ్చిన ఎన్టీ రామారావు వీరాభిమాని, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఎన్టీఆర్ రాజును (రామచంద్రరాజు)ను ఆరోగ్యం ఎలా వుందంటూ పరామర్శించారు. ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, అనురాధ, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులు అమరనాథ రెడ్డి, జగన్మోహన్, మురళీమోహన్, ఆదిమూలం, పార్టీ నాయకులు నరసింహయాదవ్,పులిగోరు మురళి, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, జేబీ శ్రీనివాస్,రవినాయుడు, శ్రీధర్‌వర్మ, రాజు యాదవ్, కేశవులు, శివషణ్ముగం, దేవ, బాలాజీ, విశ్వ, అంజి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిపై తొలగని సస్పెన్స్

**మీరు గెలుపు కోసం పనిచేయండి! అభ్యర్థి సంగతి అధ్యక్షుడు చూసుకుంటారు!!**

### తిరుపతి జనసేన నేతలతో నాగబాబు



నాగబాబును సన్మానిస్తున్న జనసేన నేతలు

తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన సీటు గెలుపు కోసం మీరు పనిచేయండి... అభ్యర్థి సంగతి అధ్యక్షుడు పవన్ చూసుకుంటారు... అంటూ తిరుపతి జనసేన నాయకులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు దిశానిర్దేశం చేశారు. గురువారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన తిరుపతి నాయకులతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సందర్భంగా పలువురు నాయకులు తిరుపతిలో నెలకొన్న పరిస్థితులను నాగబాబు దృష్టికి తీసుకెళ్ళారు. నగర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ అర్థరాత్రి అయినా కార్యకర్తలకు అండగా నిలిచే నేతకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు పలువురు నాయకులు బయటి వారికి టికెట్ ఇస్తే తిరుపతి ప్రజలు ఆమోదించే పరిస్థితి లేదన్నారు. పార్టీ అభ్యర్థి తమను ఇంతవరకూ కలవలేదని, కార్యక్రమాల గురించి సమాచారం కూడా ఇవ్వడం లేదని మహిళా నేతల్లో సుభాషిణి ఫిర్యాదు చేయగా కీర్తన మాత్రం పార్టీ అభ్యర్థి మంచివారని, తిరుపతిలో లోకల్, నాన్ లోకల్ అన్న వాదన అర్థరహితమన్నారు. అత్యధికులు అభ్యర్థిగా స్థానికులకు అవకాశం ఇవ్వాలని కోరగా కొందరు పార్టీ ఎవరికి ఇచ్చినా పనిచేస్తామన్నారు. టీడీపీ నేతల నుంచీ సహకారం అందడం లేదని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ ఫిర్యాదు చేశారు. స్థానికుల్లో పోటీ చేయడానికి ఎవరు ఆసక్తిగా వున్నారని నాగబాబు ప్రశ్నించడంతో హరిప్రసాద్, కిరణ్ రాయల్ తాము పోటీ చేసేందుకు ఆసక్తిగా వున్నట్టు చెప్పారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమకున్న వనరులను కూడా వివరించారు. ఈ ఇద్దరూ కాకుండా ఇతరులెవరైనా వున్నారా అని నాగబాబు ప్రశ్నించగా కొందరు నాయకులు సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్ పేరును ప్రస్తావించారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ ప్రస్తుత అభ్యర్థి తిరుపతిలో గెలిచే అవకాశం లేదని, అతన్నే కొనసాగిస్తే ఓడిపోవడంతో పాటు పార్టీ ప్రతిష్ట కూడా దెబ్బతింటుందని స్పష్టం చేశారు. మెజారిటీ నాయకులు అభ్యర్థిని మార్చాలని, స్థానికులైన ఆశావహులతో రీ సర్వే జరిపించాలని కోరగా నాగబాబు పరిశీలిస్తామన్నారు. టీడీపీ నేతల నుంచీ సహకారం అందని విషయంపై టీడీపీ అధిష్ఠానంతో పవన్ కళ్యాణ్ మాట్లాడతారని నాగబాబు హామీ ఇచ్చారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి ఖచ్చితంగా గెలవాలని, దానికి ఏం చేయాలో చెప్పండని సలహాలు, సూచనలూ కోరారు. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో ఎపిక్ కార్డుల కుంభకోణానికి సంబంధించి వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి పాత్ర ఏమైనా వుందా అన్న విషయమై లోతుగా ఆరా తీయాలని ఆదేశించారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి గెలవాలని, అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాలను గౌరవించాలని ఆయన కోరారు. పార్టీ కోసం పనిచేసే వారిని పేరుపేరునా గుర్తుంచుకుంటామని, వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతిలో అభ్యర్థి విషయంలో తలెత్తిన వివాదంపై పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుతో చర్చిస్తున్నారని వివరించారు. లోకల్, నాన్ లోకల్ సమస్య లేవనెత్తి వైసీపీ ట్రాప్‌లో పడొద్దంటూ ఆయన హెచ్చరించారు. తిరుపతి నేతలతో త్వరలో అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమావేశమవు తారన్నారు. రాజకీయాల్లో ఎపుడు, ఎవరికి ఏమి జరుగుతుందన్నది చెప్పలేమని, కొన్నిసార్లు త్యాగాలు చేయాల్సి వస్తుందన్నారు. తాను కూడా ఎంపీగా పోటీ చేసేందుకు ఓ నియోజకవర్గంలో కొంతకాలం పని చేశానని, అయితే తర్వాత ఆ నియోజకవర్గం వదులుకోవాల్సి వచ్చిందని స్వానుభవం వెల్లడించారు. పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారని, ఆ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. అభ్యర్థి విషయం పార్టీ అధ్యక్షుడు చూసుకుంటారని, ఆ విషయం ఆయనకు వదిలిపెట్టి తిరుపతిలో జనసేన గెలిచేందుకు కష్టపడి పనిచేయాలని ఆయన తిరుపతి నాయకులను ఆదేశించారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచీ సాయంత్రం 5.30 గంటల వరకూ సమావేశం కొనసాగగా పార్టీ పరిశీలకుడు అజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. దీంతో తిరుపతి జనసేన అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులే కొనసాగుతారా? లేక మార్పు వుంటుందా? అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే మిగిలిపోయింది. తిరుపతి నాయకులతో త్వరలో పవన్ కళ్యాణ్ సమావేశమయ్యేదాకా అభ్యర్థిపై నెలకొన్న సస్పెన్స్ ఇలాగే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

### లోకేశ్‌తో ఆరణి భేటీ



తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తిరుమలలో కలిశారు.టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆయన వెంట వున్నారు.అనంతరం శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను లోకేశ్‌కు వివరించా నన్నారు.స్థానిక నేతలతో మాట్లాడి తనకు సహకరించేలా చూడాలని అభ్యర్థించగా ఒకట్రెండురోజుల్లో పరిస్థితులు సర్దుకుంటాయని, జాగ్రత్తగా పనిచేసుకోండని లోకేశ్ సూచించినట్టు చెప్పారు.అనంతరం మరో బృందంగా టీడీపీ నాయకులు ఊకా విజయ్‌కుమార్, నరసింహ యాదవ్, పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్ తదితరులు లోకేశ్‌ను కలిశారు.

# రాబోయేది కూటమి ప్రభుత్వమే..

● జగన్ పిచ్చి పరాకాష్టకు చేరింది ● ప్రజలు తనను ఆదరించి.. గెలిపించాలి ● పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి


గండబోయనపల్లెలో టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, మార్చి 21:సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టబోయేది టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వమేన ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సైకో సీఎం జగన్‌పిచ్చి పరాకాష్టకు చేరిందని, మళ్లీ అధికారం కోసం చేస్తున్న వైసీపీ కుయుక్తులు ఇక చెల్లబోవని ఆయన ధ్వజమెత్తారు. గురువారం వాల్మీకిపురం మండలం లోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. యర్రావాండ్లపల్లెలో ఇంటింటా సూపర్ సిక్స్ సంక్షే మ పథకాల కరపత్రాలు పంచుతూ వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజల రుణం తీర్చుకునేలా అందుబాటులో ఉండి మండలాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానన్నారు. ప్రచారంలో భాగంగా గండబోయనపల్లెకు విచ్చేసిన ఆయనకు నాయకులు ఆపిల్ పండ్ల గజమాలతో స్వాగతించారు. బస్టాం డు వద్ద పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి ఇంటింటి ప్రచారం చేపట్టారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తూ మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్న జగన్ వచ్చే ఎన్నికల్లో కనుమరుగు కావడం ఖాయమన్నారు. దాడులు, అరా చకాలు, మోసాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న వైసీపీకి రాబోయే ఎన్నికల్లో పుట్టగతులుండవన్నారు. రాష్ట్రంలో వచ్చేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమేనన్నారు. ఈకార్యక్రమాలలో పీలేరు జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, ఇరుపార్టీల మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, మహేష్, పీలేరు టీడీపీ యువత అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహీధర్‌రెడ్డి, లంకిపల్లి మధు, నాయకులు పులి సత్యనారాయణరెడ్డి, అమరనాథరెడ్డి, కృష్ణరెడ్డి, మద్దెల గిరిబాబు, రామాంజనేయులు, సునీల్ తదితర నాయ కులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

**టీడీపీలో చేరిన నాయకులు, యువత..**

వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీలో గురువారం పలువురు నాయకులు, భారీగా యువత టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామపంచాయతీలోని గంగిరెడ్డి, కోటకొండ భీమరాజు, ప్రకాష్‌రావ్, సంజయ్ దీపక్, అభి, చందు, హరి, వంశీ, దొరబాబు, సమీర్, ఖాదర్‌బాషా, ప్రభు, మొహమ్మద్‌రఫీ, కుమారస్వామి, మహ్మద్, కిశోర్, రెడ్డి, ముబారక్, అక్బర్, ఆలీ, నవీన్, నాని తదితరులు టీడీపీలో చేరగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరూ టీడీపీ గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు.

### టీడీపీ పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా

కలికిరి, మార్చి 21: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మహి ళలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పీలేరు టీడీపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం ఆమె కలికిరి పంచాయతీలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. మహిళలను వివిధ రంగాల్లో అభివృద్ధి చేయడానికి టీడీపీ ఎప్పు డూ ముందుంటుందని చెప్పారు. పంచాయతీలోని రామ్‌నగర్ కాలనీ, బట్రెడ్డిగారిపల్లె, శీనయ్య కాలనీ, నర్రావాండ్లపల్లె, అండేకురవపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీ హామీలకు సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో కలికిరి సర్పంచు ప్రతాప్ కుమార్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు చంద్రకుమార్ రెడ్డి, మాలతి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, రత్న శేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, అవినాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి


మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పెద్దతిప్పసముద్రం మార్చి 21 : తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కమ్మచెరువు పంచాయతీ గారచెట్లపల్లె గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లా డుతూ గ్రామంలో పంచాయతీ తాగునీటి బోరులో నీరు పుష్క లంగా ఉన్నా బోరు మోటర్‌కు విద్యుత్ సర్వీసు లేకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందని వాపోయారు. గ్రామంలో తాగునీటి బోర్లు రెండు ఉన్నాయని, అయితే గత సర్పంచ్ హ యాంలో ఆ బోరుకు విద్యుత్ సర్వీసు ఏర్పాటు చేసి తాత్కా లికంగా మోటర్ వదులుతుండేవారని, అయితేఇప్పుడు ఆ బోరు మోటర్లకు సర్వీసులు లేవని కొంత మంది రైతులు సర్వీసును తొలగించారని, అందుకే నీటి సమస్య తలెత్తిందన్నారు. గత పది రోజుల నుంచి తాగునీటి సమస్యతో వ్యవసాయ పొలాల వద్ద కు పరుగుతీయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పంచాయతీ అధికారులకు, సర్పంచ్‌కు విషయాన్ని తెలియచేసినప్పటికి పలి తం లేకపోవడంతో ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇప్ప టికైనా సంబంధిత అధికారులు పంచాయతీ బోరుకు విద్యుత్ సర్వీసును ఏర్పాటు చేసి గ్రామానికి తాగునీటి సమస్యను పరి ష్కరించాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు శంకర్‌రెడ్డి, వెంకట్రమణ, గంగులప్ప, వెంకటశేషారెడ్డి, వెంకటర మణమ్మ, గిరిజమ్మ, పద్మమ్మ, ఈశ్వరమ్మ, కల్పన, రత్నమ్మ, దేరంగుల వెంకటరమణ, యు. వెంకట్రమణ సందే రవి తదిత రులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు


బండకిందతాండాలో తాగునీటిపథకం బోరును పరిశీలించి ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దమండ్యం, మార్చి 21: ప్రస్తుత వేసవిలో గ్రామాలలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీ డీవో వెంకటరమణయ్య పేర్కొన్నారు. మండలంలోని రామా నాయక్‌తాండా గ్రామ పంచాయతీ బండకిందతండాలో తాగు నీటి పథకం బోరులో నీరు రాలేదనితాండా వాసులు అధికా రుల దృష్టికి తెచ్చారు. దీంతో గురువారం బండకిందతాండాలో తాగు నీటి పథకం బోరును ఎంపీడీవో వెంకటరమణయ్య, ఏఎస్‌ఐ మధుసూదనాచారి, ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ హరిప్రసాద్ గ్రామస్థుల తో మాట్లాడారు. బోరులో నీరు అట్టడుగు పోవడంతో రోజుకు అరగంట మాత్రమే బోరులో తాగునీరు వస్తున్నాయని తాండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్థులు కోరారు. మండలంలో భూగర్భ జలాలు ఇంకిపోడంతో మరో నాలుగు గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామాలలో ముంచుకొస్తున్న తాగునీటి సమస్యలపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. .

## కర్ణాటక మద్యం స్వాధీనం ఇద్దరు నిందితుల అరెస్టు


ఇద్దరు నిందితుల అరెస్టుతోపాటు మద్యం స్వాధీనం చేసుకున్న రూరల్ పోలీసులు

మదనపల్లె అర్బన్, మార్చి 21: కర్ణాటక మద్యం తరలిస్తున్న మద్యంతోపాటు బైకు సహా ఇద్దరు నిందితులను అరెస్టు చేసి నట్లు తాలుకా సీఐ శేఖర్, ఎస్‌ఐలు వెంకటేష్, రవికుమార్‌లు తెలిపారు. గురువారం మదనపల్లె మండలం చీకలబైలు గ్రామా నికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 27వేలు విలువ చేసే కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకు న్నారు. పోలీసుల వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం శ్రీనివా సపురం తాలుకా, రాయల్పాడు నుంచి మదనపల్లెకు కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు మద నపల్లె రూరల్ పోలీసులు చీకలబైలు పంచాయతీ మేడిపల్లె అటవీప్రాంతం వద్ద మాటు వేసి చీకలబైలు కు చెందిన మండెం నవీన్ (29), నాగినేని శ్రీనివాసులు(30) అనే ఇద్దరి అరెస్టు చేసి వారు నడుపుతున్న బైకును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం .. వ్యక్తి అరెస్ట

కలకడ, మార్చి 21: కలకడ బస్టాండ్ సమీపంలో కారులో అక్ర మంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి గంగయ్యను గురువారం అరెస్ట్ చేసి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామ కృష్ణారెడ్డి తెలిపారు. కేవీపల్లి మండలం చీనేపల్లికి చెందిన గంగ య్యను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని కారును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించమన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

మదనపల్లె అర్బన్, మార్చి 21: మదనపల్లె ఆర్టీసీ టూ డిపో పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు ఆ డిపో ఇన్‌చార్జి మేనేజరు మూరే వెంకటరమ ణారెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్సుల వలన, ఉద్యోగుల వలన కలిగే సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం టూ డిపోలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, ప్రయా ణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెద్దతిప్పసముద్రం మార్చి 21 : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో అంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ శుక్రవా రం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన మూగలమర్రి నారాయణరెడ్డి తన సొంత నిధులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేకువజామునే స్వామి విగ్రహానికి వేదపండితులచే కలశ స్థాపన, గంగపూ జలతో పాటు విశేష పూజలు నిర్వహించి నూతన విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మండలంలోని ప్రజలు విచ్చేసి స్వామి వారి కృపకుపాత్రులు కావాలని ఈ సందర్భంగా గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికల్లో 17 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాల్లో వీసీకే పార్టీ పోటీ

మదనపల్లె అర్బన్, మార్చి 21: ఏపీలో నిర్వహిస్తున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో 17 అసెంబ్లీ, 4 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయడానికి వీసీకే (విడుదలై చిరుతైగల్ కచ్చి) పార్టీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ గురువారం తెలి పారు. మదనపల్లె , రాయచోటి, కుప్పం, పలమనేరు, నగరి, సత్యవేడు, చంద్రగిరి, కళ్యాణదుర్గం, బాపట్ల, వేమూరు, తెనాలి అమలాపురం, మండిపేట, చిలకలూ రుపేట, సూళ్లూరుపేట, నందిగామ, నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాల తోపాటు రాజంపే ట, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, పార్లమెంట్ నియోజకవార్గల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని ఆయన పేర్కొన్నారు. వీసీకే పార్టీ ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్నందున తమ పార్టీ పోటీ చేయదలసిన స్థానాల జాబితాను వీసీకే పార్టీ జాతీ య అధ్యక్షుడు డాక్టర్ తిరుమావ ళవన్ ద్వారా ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలా కు అందజేయడం జరిగిందన్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సిఉందన్నారు. కాంగ్రెస్‌తో సీట్లు సర్దుబాటు కుదరకపోతే మా పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఈ సందర్భంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా దారాపారేశి


పారేశికి నియామకపత్రం అందిస్తున్న వేల్పులశ్రీధర్

మదనపల్లె అర్బన్, మార్చి 21: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్య దర్శిగా మదనపల్లెకు చెందిన దారాపారేశి ని యమితులయ్యారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి వేల్పుల శ్రీధర్ ఆయనకు నియామక ప్ర తం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దారా పారేశి గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఈ పదవి అప్పగించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పారేశికి అభినందనలు తెలిపారు. పారేశి మా ట్లాడుతూ తనపై నమ్మకంతో కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, రాహుల్‌గాంధీకి, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలాకు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సాకే శంకర్, వేల్పుల శ్రీధర్‌కు ధన్యావాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## జాతీయస్థాయిలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలను అందుకుంటున్న మిట్స్ విద్యార్థులు

కురబలకోట, మార్చి 21: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్‌ఈ(డేటాసైన్స్) తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు కడప అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయస్థాయి సింపోజియం పోటీలలో పాల్గొన్నారని ఈ పోటీలలో ఇంద్రకుమార్ మాధవరావులు క్రాప్ రెకమెండేషన్ బేస్డ్ ఆన్ యన్‌పీకే వ్యాల్యూస్ యూసింగ్ ర్యాండమ్ ఫారెస్ట్ అనే అంశంపై పరిశోధనను ప్రదర్శిం చగా ప్రథమ బహుమతిని సాధించారన్నారు. గెలుపొందిన విద్యార్థుల కు ప్రశంసా పత్రాలను మెమెంటోలను అందజేశారు. ప్రతిభ కనబ రిచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి కుసు మ తదితరులు అభినందించారు.

## పాపేపల్లి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**27న స్వామివారి కల్యాణం.. తిరుణాల**

పెద్దమండ్యం, మార్చి 21: మండలంలో ప్రసిద్ధి చెందిన పాపేపల్లి కుషావతి నది తీరంలో ఏకశిలగుట్టపై మాండవ్య మహర్షిచే ప్రతిష్ఠిం చిన లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 30వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పి. రమణ వెల్లడించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో అంకురార్పణ ప్రత్యేక పూజలు జరి గాయి. 22న ఉదయం ధ్వజారోహణం, రాత్రి హనుమంత వాహనం పూజ కార్యక్రమాలు ఉభయదారులు నిర్వహిస్తారని తెలిపారు. 23న సింహవాహనం, 24న శేషవాహనం, 25న గజవాహనం, 26న గరుడవాహనం, 27న రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం, తిరుణాళ జరుగుతుందన్నారు. 28న అశ్వవాహనం, 29న వసంతోత్సవం, 30న శయనోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్స వాలలో భాగంగా స్వామి వారికి వేదపండితులు ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవోతో పాటు ఆలయ నిర్వాహకులు ఆలయ అర్చకులు విష్ణుమాచార్యులు, బ్రహ్మోత్సవాల నిర్వాహకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

పీలేరు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే ఆదేశాలు, నియమాలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ సూచించారు. పీలేరులోని తహసీ ల్దారు కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గంలోని రాజకీ య పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ తమకు అన్ని పార్టీలు ఒక్కటేనని, ఎన్నికలకు సంబం ధించిన ఏ పని చేయాలన్నా రాజకీయ పార్టీలు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన కోడ్ ను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రచారాలు, కార్యా లయాల ఏర్పాటు, వాహనాల ద్వారా ప్రచారం వంటి వాటి కోసం 'సువిధ' యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఆ యాప్ అందుబాటులో ఉందని, దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో అనుమతు లు లభిస్తాయన్నారు. కోడ్ ఉల్లంఘించే వారిపై 'సి-విజిల్' యాప్ ద్వా రా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. అనంతరం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులకు 'సి-విజిల్' యాప్ పనితీరును వివరించారు. ఈ సమావేశంలో ఈఆర్‌వో రమ, పీలేరు, వాల్మీకిపురం, కలకడ, కేవీపల్లె, గుర్రంకొండ, కలికిరి తహసీల్దారు మహబూబ్ బాషా, ఖతీజున్ ఖుబ్రా, విజయకుమారి, శ్రీనాథ్, ప్రియదర్శిని, నయాజ్ అహ్మద్, టీడీపీ, వైసీపీ, సీపీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.


## ఎన్నికల నియమావళిని తప్పక పాటించండి


ఎన్నికల నియమావళిపై అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటిం చాలని ఆర్డీవో హరిప్రసాద్ ఆదేశించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఏఆర్‌వోలు, ఎంసీసీ, సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకులు ఏవై నా సమావేశాలు, సభలు, ప్రచార ర్యాలీలు నిర్వహించాలంటే తప్పని సరిగా రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. మున్సిపల్‌శాఖ, పంచాయతీరాజ్ శాఖ, పోలీసుశాఖ, రవాణాశాఖ, విద్యుత్‌శాఖ, ఫైర్ శాఖ, ఫారెస్ట్‌శాఖ నోడల్ ఏజెన్సీలుగా ఉంటారన్నారు. ఎన్నికల ప్రవర్త నా నియామవళిని ఎలా అమలు చేయాలో సూచనలిచ్చామన్నారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు కరపత్రం ముద్రించే, ఫ్లెక్సీలు ముద్రిం చే వారు ఇతర పార్టీల వ్యక్తిగత, అసత్య ప్రచారాలు చేయరాదన్నారు. వాటిని అభ్యర్థుల ఖర్చులో వేస్తామన్నారు. ఏప్రిల్ 17 వరకు పార్టీల పేరుతో, నామినేషన్ల తరువాత అభ్యర్థుల పేరుతో అనుమతులు ఇస్తా మన్నారు. సమావేశంలో మున్సి పల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దమండ్యంలో:** ఎన్నికలు కోడ్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని పెద్ద మండ్యం ఎస్‌ఐ చెన్నకేశవ హెచ్చరించారు. మండలంలోని బండమీ దపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి గ్రామస్థులకు గురువారం రాత్రి ఎన్నికల కోడ్ నిబంధనలను ఎస్‌ఐ వివరించారు. గ్రామాల్లో అపర చితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నాటుసారా అమ్మకాలు, తయారీలతో పాటు, జూదాలు, కోడిపందేలు ఆడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు మధుసూధనాచారి, ఇషాక్, పోలీసులు క్రిష్ణమూర్తి, పి. ఖాన్, మధు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌లలో వసతులు కల్పించాలి


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో, ఎస్‌ఐ

నిమ్మనపల్లి, మార్చి 21: పోలింగ్ బూత్‌లలో వసతుల ను కల్పించాలని ఎంఈవో పద్మావతి, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు మండలంలోని తవళం, అగ్ర హారం, అడసుపల్లి, నిమ్మనపల్లి, వెం కోజిగారిపల్లి పంచాయతీ ల్లోని బూత్‌లను పరిశీలించి కొన్ని బూత్‌లలో వసతులు అసంపూర్తిగా ఉన్నాయని త్వరతగతిన వాటిని పూర్తిచే యాలని సూచించారు. అలాగే విద్యుత్, వెలుతురు, బాత్‌రూమ్‌లు, తాగునీటి సమస్య రాకుం డా చూడాలన్నారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ నాటుసారా, జూ దం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ఎన్నికల్లో ఆదరించి గెలిపించండి.. అండగా ఉంటా

● తంబళ్లపల్లె కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి
● వైసీపీ నుంచి టీడీపీలోకి మద్దయ్యగారిపల్లె గ్రామస్థులు


టీడీపీలో చేరిన వారితో అభ్యర్థి జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం మార్చి 21 : ఎన్ని కల్లో తనను ఆదరించి గెలిపిస్తే అండగా ఉంటానని తంబళ్లపల్లె టీడీ పీ-జనసేన-బీజే పీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ప్రజలను కోరారు. పెద్దతిప్పస ముద్రం మండలం మద్దయ్యగారి పల్లె కు చెందిన పలువురు వైసీపీ నుంచి గురువారం జయచంద్రా రెడ్డి సమక్షంలో ములకలచెరువులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారిని టీడీపీ కండువాలు కప్పి సాదరంగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన పలువురు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అయిన దాసరిపల్లె జయచంద్రారెడ్డిని గెలిపించడమే లక్ష్యమ న్నారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ దుర్గం నరసింహులు, దుర్గం కృష్ణప్ప, కొత్తకోట సిద్దప్ప, ఆదెప్ప, సోము, రాజు, ఆంజి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నెరిపల్లె ఆంజప్ప, మాజీ ఎంపీటీసీ రమణ, టీడీపీ సీనియర్ నాయకులు ఈతముక్కల హరిబాబు, శ్రీనివాసులు, ఇడగొట్టి వెంకట్రమణ, బత్తల వెంకట్రమణ, ఆర్. విశ్వనాథ్, ప్రవీణ్, సోమిశెట్టి, మధు, శ్రీకాంత్, రెడ్డిబాష, సాంబ, ఎగువకోట హరి, పులగంటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమిని గెలిపించండి


తంబళ్లపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

తంబళ్లపల్లె, మార్చి 21: రాష్ట్ర భవి ష్యత్తు కోసం రాబోయే ఎన్నికల్లో టీడీ పీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డికి ఓటేసి గెలిపించాలని తంబళ్లపల్లె జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ కోరారు. గురువారం తంబళ్లపల్లెలో బాబు ష్యూరి టీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు తంబళ్లపల్లె పట్టణంలోని సిద్దారెడ్డిగారిపల్లె, చేలూరివాండ్లపల్లె, మగ్గాలిండ్లు తదితర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్య క్షుడు రెడ్డప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, సోముశేఖర్, తెలుగుయువత నరసింహులు, శశిధర్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, పురుషోత్తం, సుబ్రమణ్యం, వీరాంజినేయులు, సుబహా న్, రఘుపతి, పీర్లమాబు, మల్లేష్, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎం చేయాలి


బైక్‌ర్యాలీలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 21: మదనపల్లెలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా ను ఎన్నికల్లో గెలిపించి రాష్ట్రానికి చంద్ర బాబును సీఎం చేయాలంటూ చీకిల బైలు గ్రామస్థులు బైక్‌ర్యాలీ నిర్వ హించారు. గురువారం చీకిలబైలు సర్పంచ్ ఎం.ప్రభాకర్ ఆధ్వర్యంలో చీకిలబైలు నుంచి షాజహాన్‌బాషా నివాసం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా గ్రామస్థులతో పాటు బైక్ ర్యాలీలో పాల్గొన్న షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రతి టీడీపీ కార్యకర్త ఎన్నికలు ముగిసే వరకు ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు. చంద్రబా బు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తూనే మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్ నాయుడు, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప, శ్రీకాంత్‌రెడ్డి, రాజన్న, వై నరసింహులు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక నీరుగట్టువారిపల్లెలో చేనేత మగ్గాల యజమానుల సంఘం మహేష్ పిలుపుతో షాజహాన్‌బాషా కలిశారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు సీడ్ మల్లికార్జున నాయుడు, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, దొరస్వామినాయుడు, ఆర్‌జే వెంకటేష్, టీ కృష్ణప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## షాజహాన్‌బాషా గెలుపునకు కలసికట్టుగా పనిచేస్తాం


విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ ఖాదర్‌ఖాన్

మదనపల్లె టౌన్, మార్చి 21: మదనపల్లెలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా గెలుపు కోసం అందరం కలసికట్టుగా పనిచేస్తామని పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర కార్యదర్శి, పోత బోలు మాజీ సర్పంచ్ పఠాన్‌ఖాదర్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం పోతబోలులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని విధాల సర్వే చేసే చంద్రబాబునాయుడు మదనపల్లె టీడీపీ అభ్యర్థిగా షాజహాన్‌బాషాను ఎంపిక చేశారన్నారు. వారం రోజులుగా నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి ముస్లిం మైనారిటీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ కులాలకు చెందిన ప్రజలు, మేధావులు వచ్చి షాజహాన్‌బాషాకు మద్దతు ప్రకటిస్తున్నారన్నారు. పోలింగ్ తేదీ వరకు ప్రతి టీడీపీ కార్యకర్త విశ్రమించకూడదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాండ్లసంఘం నాయకుడు కేశవ పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత మద్దతు కోరిన షాజహాన్‌బాషా


షాజహాన్‌బాషాను ఆహ్వానిస్తున్న సీనియర్ నేత సీడ్ మల్లికార్జుననాయుడు

మదనపల్లె, మార్చి 21: మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా గురు వారం టీడీపీ సీనియర్ నేత, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు సీడ్ మల్లికా ర్జుననాయుడును కలిసి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. రెడ్డిస్ కాలనీలో టీడీపీ సీనియర్ నేత నివా సంలో అయన్ను కలిసి. అందరం కలిసి కట్టుగా పార్టీ గెలుపు కోసం కృషిచేయా లని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషకు టీడీపీ సీనియర్ నేత మల్లికార్జుననాయుడు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. షాజహాన్‌బాషా వెంట మదనపల్లె నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, టీడీపీ రాజంపేట పార్ల మెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, నేతలు కృష్ణమనాయుడు, ఆర్‌జే వెంకటేష్, నవీన్‌కుమార్ చౌదరి తదితరులు ఉన్నారు.

## గుర్రంకొండలో టీడీపీ పథకాలపై విస్తృత ప్రచారం


గుర్రంకొండలో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

గుర్రంకొండ, మార్చి 21:తెలుగుదే శం పార్టీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిం చాలని కోరుతూ టీడీపీ నాయకు లు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని బలిజగడ్డలో టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేసి ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేసి టీడీపీకి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ నౌషాద్ అహ్మద్, ఏజాజ్, నక్కా సతీష్‌కుమార్, విజయ్, సుబ్బన్న, రమణ, మౌలా, తన్వీర్, బాబాజాన్, జమీర్, చిన్నప్ప, శ్రీనివాసులు, గౌరి శ్రీన, గౌస్‌మోదీన్ తదితరులు పాల్గొన్నారు.

## బి.కొత్తకోటలో పోలీసుల కార్డెన్ సర్చ్


పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ సూర్యనారాయణ

బి. కొత్తకోట, మార్చి21: బి. కొత్తకోట పట్టణ శివారు గ్రామాలలో గురు వారం పోలీసులు కార్డెన్‌సర్చ్ నిర్వ హించారు. స్థానిక పోలీసు సిబ్బం దితో పాటు, సెంట్రల్ ఆర్మ్డు రిజర్వుడు పోలీస్ ఫోర్స్ కార్డెన్‌సర్చ్ నిర్వహించి సరైన రికార్డులు లేని, అనుమానాస్పదంగా ఉన్న పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ లు చేపట్టామన్నారు. ఈ తనిఖీలలో నగరపంచాయతీ పరిధిలోని డేగానిపల్లెకు చెందిన చంద్రపృథ్వీ(24) అనే వ్యక్తి కర్నాటక మద్యం తెచ్చి విక్రయిస్తుండగా అరెస్టు చేసి రిమాం డుకు తరలించామన్నారు. అనంతరం కేంద్ర బలగాలతో గ్రామంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిం చారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు, కోడ్ ఉల్లంఘనలు చేసినా తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని సీఐ హెచ్చరించారు.